₹ 10/-
జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 04
ఫిబ్రవరి 16-28, 2018



స్థానిక ప్రభుత్వాలకు తలసరి కేటాయింపులు చేయాలి



'ప్రాథమిక' పునాది లేని పెద్ద ఆరోగ్య పథకం



ప్రధానమంత్రి పదవికన్నా పౌరసత్వం గొప్పది



తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కలసిపోరాటం

నీతి అయోగ్ ద్వారా కేంద్రానికి లోక్‌సత్తా అందించిన 'అందరికీ ఆరోగ్యం' విధానం వివరాలు










# ప్రత్యేక హోదా, రైల్వే జోన్ కోసం చలో ఢిల్లీ దీక్షలో పాల్గొన్న లోక్‌సత్తా

వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక హోదా పారిశ్రామిక రాయితీల్ని, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌ను వెంటనే ప్రకటించాలని, విభజన హామీల్ని అమలు చేయాలని ఉత్తరాంధ్ర చర్చావేదిక అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వరకు ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో చేపట్టిన 48 గంటల రైలు నిరాహార దీక్షలో లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ పాల్గొన్నారు. లోక్‌సత్తాతో పాటు పలు పార్టీలు, సంఘాలు ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించాయి. ఈ డిమాండ్ల సాధన కోసం అల్లంశెట్టి నాగభూషణం, చిన్నారావు, రాజారావు, శిమ్మ శ్రీనుల ఆధ్వర్యంలో విజయనగరం రైతుబజార్ వద్ద లోక్‌సత్తా నిర్వహించిన సంతకాల సేకరణకు విశేష స్పందన లభించింది. ఢిల్లీ రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీకి నివాళులర్పించిన అనంతరం కొణతాల దీక్షను బృందం విరమింపచేసింది. మాజీ ఎంపీలు కణితి విశ్వనాథం, జ్ఞానేంద్రరెడ్డి, ఉత్తరాంధ్ర ప్రజాసంఘాలు, కళాకారులు ఆదాడ మోహన్‌రావు, దప్పు శ్రీను, దేవీశ్రీ, భాస్కర్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి జరిగిన అన్యాయంపై ఏపీ భవన్ వద్ద వీరు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నారాయణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యాయంపై పార్లమెంటులో గళం విప్పాలని, ప్రభుత్వాన్ని కదిలించాలని కోరుతూ మాజీ ప్రధానమంత్రి డా॥ మన్మోహన్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, సీపీఎం. జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరిలను కలిసి బృందం విజ్ఞప్తి చేసింది. అనంతరం కేంద్రమంత్రులు అశోక్‌గజపతిరాజు, రవిశంకర్ ప్రసాద్‌లను కూడా కలిసి ఉత్తరాంధ్ర, ఏపీ సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఫిబ్రవరి 16-28, 2018 సంపుటి - ౨ సంచిక - 04




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై ............... 5

విద్య వ్యవసాయం గురించి మాట్లాడారంటే..... 6

సవాళ్లకు స్వీట్ కోటింగ్ ! ........................... 7

వృద్ధిరేటు 6.5 శాతమే .............................. 12

కేంద్ర బడ్జెట్ 2018 - 19.......................... 14

నీతి ఆయోగ్‌కి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా 2016..... 20

ప్రధానమంత్రి పదవికన్నా పౌరసత్వం గొప్పది....23

విలువలకు పాతర... వివాదాల జాతర.......... 28

ఆర్‌ఎంపీలతో పోరాటం వైద్యుల స్థాయికి ....... 31

ఆచరణ సాధ్యమయ్యే హామీలే సురాజ్య యాత్ర.. 32

(మీడియాలో ) 'కీ' కామెంట్లు ! ..................... 33

స్థానిక ప్రభుత్వాలకు 50 శాతం నిధులివ్వాలి... 34

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా॥ ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836, **SBI** పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# విధానాలు, కార్యాచరణల భారతం కావాలి!



**స్వా**మి వివేకానంద జన్మదినం 'జాతీయ యువజనదినోత్సవం' కాకముందు దశాబ్దాల నుంచీ ఆయన ప్రభావం భారతీయ యువత మీద గణనీయంగా ఉంది. ఆత్మన్యూనతతో దైన్యంలో కొట్టుమిట్టాడుతున్న జాతిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారాయన. ఆయన ఆశయాలను వ్యాపింపచేసే క్రమంలో యువతకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్న రామకృష్ణా మిషన్ ప్రతినిధి ఒకరు ఇటీవల టెలివిజన్‌లో ఓ విజ్ఞప్తి చేశారు. "మీరు వివేకానందను ఆరాధించనక్కర్లేదు. ఆయనకు పూజలు చేయనక్కర్లేదు. వివేకానంద చెప్పిన మాటల్ని ఆచరించి చూపండి-ఇకనుంచైనా! అప్పుడే స్వామీజీ కలలుగన్న, మీరు కోరుకుంటున్న నవభారతం నిర్మాణమవుతుంది".. యువతకే కాదు, వివేకానందుని పూర్వ నామాన్ని పెట్టుకుని ఆయన పట్ల అపారమైన విశ్వాసాన్ని, వినమ్రతను ప్రదర్శించే ప్రధాని నరేంద్ర మోదీ సహా ఈ దేశంలోని పాలకులందరికీ ఇవి హితవచనాలు! ఉపన్యాసాలు, నినాదాలు, పంచ్ డైలాగులు, పింక్ కలర్ అట్టలు వంటి సంకేతాల్ని దాటి మంచిని ఆచరణలో చూపాలి.. కానీ మాటలు చేతలుగా మారాలంటే సదుద్దేశాలుంటే చాలదు.. తగిన అవగాహన, విధానాలు, వాటి అమలుకు తగిన వ్యవస్థలు ఉండాలి. ఏళ్లుగా మన దేశాన్ని పీడిస్తున్న ఈ వ్యవస్థీకృత సంక్షోభాన్ని ఇప్పటికీ ఎదుర్కోవటానికి మనం సిద్ధపడటకపోవటమే విషాదం. ఇటీవల దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక మీద ప్రధానమంత్రి మాట్లాడుతూ.. చీలికలకు తావులేని స్వేచ్ఛాపూరిత స్వర్గాన్ని ఆవిష్కరించాలని ప్రపంచ దేశాలకు, పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఆ పిలుపు పైకి ఘనంగా ఉందిగానీ, నిజంగా 'విభజనలు లేని ప్రపంచం' అనే ఆకాంక్షను నెరవేర్చేందుకు భారత్‌లో మనం ప్రయత్నిస్తున్నామా? మనదేశంలో.. చట్టబద్ధపాలన దారుణం. సినిమాలు రిలీజ్ చేస్తే, నచ్చిన ఆహారం తింటే తలకాయలు తీసేస్తామన్నా, చివరికి స్కూలు పిల్లల వాహనాల మీద దాడులు చేస్తున్నా చట్టప్రకారం సకాలంలో చర్యలు తీసుకోని పాలన నడుస్తోంది. అత్యధికులకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అందవు. విద్యాహక్కు చట్టం వచ్చినప్పుడు బడిలో చేరి యుక్తవయస్కులైన వారితో సహా 14-18ఏళ్ల వయస్కుల విద్యాప్రమాణాల మీద ఇటీవల 'అసర్' జరిపిన సర్వేలో 25శాతం మంది మాతృభాషలోని అంశాలనే చదవలేకపోతున్నారు, 40శాతంమంది గడియారం చూసి సమయం చెప్పలేకపోతున్నారు. మరోవైపు, కేవలం ఆస్పత్రుల ఖర్చుల వల్ల దాదాపు 6కోట్ల మంది ఏటా పేదలుగా మారుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు అవినీతిమయం, చిన్న పనులకు కూడా జనం ఉండే చోట స్థానికంగా నిధులు, అధికారాలు ఉండవు. జనాభాలో అత్యధికులు ఆధారపడిన వ్యవసాయంలో తీవ్ర సంక్షోభం కొనసాగుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది సురాజ్య పాలన అందించే ప్రయత్నం చేయకుండా.. కేవలం స్వేచ్ఛావాణిజ్యాన్నే పెంచుకుంటూ పోవటం వల్ల ప్రధాని ఉటంకించిన రవీంద్రనాథ్ ఠాగూర్ పద్యంలోని అడ్డుగోడలు లేని స్వేచ్ఛాప్రపంచం సాధ్యమవుతుందా? "ఇంటి గోడలు, కిటికీలు మూసివేయాలనుకోవటం లేదు, అన్ని దేశాల గాలులూ నా ఇంట్లోకి రావాలని కోరుకుంటున్నా. కానీ ఆ గాలులు నా సొంత సంస్కృతిని పెకిలించివేయడానికి అంగీకరించను" అన్న గాంధీ వాక్యాల్ని కూడా ప్రధాని కోట్ చేశారు. సురాజ్య వ్యవస్థలో పెట్టుబడులు వాటంతటవే వస్తాయి. ప్రజలు కూడా అవకాశాల్ని అందుకుని ఎదగగలుగుతారు. కానీ సురాజ్య పాలన లేని ప్రపంచీకరణ వల్ల.. సంస్కృతి అలా వుంచి, దేశంలో ఆర్థిక అసమానతలు, కుల, మత వివక్షలు తీవ్రమవుతాయి, సొంతంగా ఎదిగే సామర్థ్యంలేని యువతతో భారత్‌లో సంక్షోభం ఇంకా రగులుతుంది. సురాజ్య విధానాలు కొంత వేళ్లూనికుని ఉన్న దేశాలే ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కోవటానికి కొత్త ఆలోచనల్ని వెతుక్కుంటుంటే, అవేవీ కనీస స్థాయిలో కూడా లేని భారత్ ఎంతకాలం ఏకపక్ష ప్రపంచీకరణను భరించగలుగుతుంది? తాజా బడ్జెట్‌లో ఆరోగ్యం, విద్య, రైతుకు ఆదాయం, మౌలిక వసతులు.. ఇలా లోక్‌సత్తా ప్రాధాన్యాంశాల ప్రతిపాదనలు కొన్నిటిని వినిపించారు. ఇందులో ఆరోగ్యం గురించి ఓ పెద్దఅడుగు వేశారు. కానీ ఆరోగ్యశ్రీ వంటి పథకాలున్నా ఆయా రాష్ట్రాల్లో ఆరోగ్య సంక్షోభం ఎందుకుందో ఆలోచించకుండా దీన్ని డిజైన్ చేశారు. పునాది అయిన ప్రాథమిక ఆరోగ్యాన్ని, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థని నిర్లక్ష్యం చేశారు. ఆరోగ్యానికి సంబంధించి ప్రజల మొట్టమొదటి కాంటాక్ట్‌గా తమకు నచ్చిన ఫ్యామిలీ డాక్టర్‌ను ఎంచుకునే అవకాశముంటేనే, కేంద్రప్రభుత్వ భారీ పథకం సత్ఫలితాలనిస్తుంది. సమర్థవంతమైన రెగ్యులేటర్‌గా, భవిష్యత్తులో వైద్య ఆరోగ్య రంగంలో రానున్న పెనుసాంకేతిక మార్పులకు తగిన వ్యవస్థగా ఫ్యామిలీ డాక్టర్‌తో కూడిన ప్రాథమిక ఆరోగ్య పద్ధతి పనిచేస్తుంది. ఇలా ప్రజారోగ్య విధానాన్ని తీర్చిదిద్దితే ఒక్కవైద్య ఆరోగ్యంలోనే 2-3 కోట్ల ఉద్యోగాలు వస్తాయని లోక్‌సత్తా చాన్నాళ్లుగా చెబుతోంది. ఇక.. సురాజ్యం లేకున్నా అయినకాడికి వచ్చే పెట్టుబడులే సర్వరోగనివారిణి అనుకుంటున్న కేంద్ర సర్కారుకి నకళ్లుగా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ వ్యవహరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో అర్జీలు లక్షల్లో వెల్లువెత్తుతున్నా, కేవలం పారిశ్రామికవేత్తల దరఖాస్తులను మాత్రమే నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కరిస్తున్నారు. సామాన్యులకూ ప్రభుత్వ కార్యాలయాల్లో పౌరసేవల చట్టం వర్తింపు, స్థానికంగా అధికారాల్ని, నిధుల్ని ఇవ్వటం, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం తదితర ఏర్పాట్లు లేకుండా రియల్ టైమ్ గవర్నెన్స్ సాధ్యమా? తెలంగాణలో బీసీలు, ముస్లింలు, ఇతర కులాల్లోని పేదలను బాగుచేయటానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంకల్పాన్ని అభినందించాల్సిందే. అయితే అందుకు కులరాజకీయాలు, రిజర్వేషన్ల పెంపు మార్గమా? ఇందుకోసమా రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు? ఇటీవల ఇండియాటుడే సౌత్ కాంక్లేవ్‌లో కూడా కేసీఆర్ ఈ అంశాలకు సంబంధించి తన పాతరాజకీయ పంథాలోనే మాట్లాడారు. హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా చేయటానికి అభ్యంతరం లేదని చెప్పటంలో మాత్రం ఆయన చెప్పుకోదగిన చొరవను ప్రదర్శించారు. 'ఢిల్లీ నుంచి పనిచేస్తే మీకు చాలా పేరు వస్తుంది, జాతీయస్థాయిలో వేగంగా ఎదగగలుగుతారు' అని చాలామంది రాజకీయ, పౌర ప్రముఖులు సలహా ఇచ్చినా మనదేశం ఢిల్లీ కేంద్రంగా మాత్రమే పనిచేయకూడదనే భావనతో హైదరాబాద్‌ను నా కార్యక్షేత్రంగా ఎంచుకున్నాను. భారత్‌కు ఢిల్లీ ఎంతో, హైదరాబాద్ కూడా అంతేనని అప్పటికీ, ఇప్పటికీ చెబుతుంటాను. హైదరాబాద్‌లోని ఆంధ్రులంతా తిరిగొస్తే ఏపీ పురోగమిస్తుందని సురాజ్య ఎజెండాను ముందుకు తీసుకెళ్లాల్సిన నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అనటం, ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణకు పోలికే లేదని కేసీఆర్ అనటం విచారకరం. నినాదాలు, హామీలు, ఆకాంక్షల దశ నుంచి.. హేతుబద్ధ ఆలోచనలు, విధానాలు, అమలు దశలోకి రాజకీయం, పాలన, సమాజం ప్రవేశిస్తేనే తెలుగు రాష్ట్రాలు, భారతదేశం పెట్టుబడుల కేంద్రాలుగా, అడ్డుగోడలు లేని స్వేచ్ఛకు నిలయాలుగా భాసిల్లుతాయి. ఉదాత్త ఆశయాలను సాకారం చేసేలా ప్రజల్ని మలిచే వ్యవస్థల నిర్మాణాన్ని రాజ్యాంగానికి జోడించే బాధ్యతను మనం నెరవేర్చటం మీదే దేశాభివృద్ధి, భవిష్యత్తు ఆధారపడి ఉంది. ★

# తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కలసి పోరాటం.. తొలి అడుగు వేసిన పవన్, జేపీ



తెలుగు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న విభజన సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటించారు.

రాష్ట్ర విభజన హామీల సాధన కోసం ఐక్యకార్యాచరణ సమితి (జేఏసీ) అవసరమని ప్రకటించిన పవన్.. అందుకనుగుణంగా హైదరాబాద్‌లోని లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ కార్యాలయానికి వెళ్లి జేపీతో సమావేశమయ్యారు. దాదాపు గంటపాటు చర్చించారు. అనంతరం ఇద్దరూ సంయుక్త మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఏర్పడిన జేఏసీలాగానే విభజన హామీల అమలు కోసం ఒక ఐక్యవేదిక అవసరమనే ఆలోచనతో జేపీని కలిశానని పవన్ కళ్యాణ్ తెలిపారు. అందరం కలిసి పోరాడటం అవసరమని జేపీ కూడా భావిస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ అంటూ మభ్యపెట్టటాన్ని మానుకోవాలన్నారు. ప్లకార్డులు, రోడ్లపై ఆందోళనలతో సమస్య పరిష్కారం కాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా, ఎవరికీ ఇబ్బందిలేని రీతిలో న్యాయమైన హక్కుల సాధన కోసం సమూహంగా, సమైక్యంగా పోరాడతామన్నారు. జేఏసీ పేరు, విధివిధానాలను ఇంకా ఖరారు చేయలేదన్నారు. త్వరలో అన్ని పక్షాలను, సంఘాలను ఒకే వేదిక మీదకు పిలిచి మాట్లాడాలనుకుంటున్నామన్నారు.

జేపీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాలకు సంబంధించిన విభజన అంశాల సాధన కోసం తాము కృషి చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో చెప్పిన అంశాల్ని అమలుచేయటంతోపాటు ప్రధానమంత్రి పార్లమెంటులో ఇచ్చిన హామీల్ని కూడా అమలు చేయాల్సిందేనన్నారు. ఏపీలో వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు బుందేల్‌ఖండ్ తరహా సాయం అందిస్తామని విభజన సమయంలో నాటి ప్రధాని హామీ ఇచ్చారని, దాన్ని తప్పటం ధర్మం కాదన్నారు. బుందేల్ ఖండ్‌లో 1కోటీ 83 లక్షల మంది జనాభా ఉంటే తలసరి రూ. 4 వేలు కేటాయించారని, ఆ లెక్కన ఉత్తరాంధ్ర, సీమలో ఉన్న 2.5కోట్ల మంది దాకా జనాభాకు రూ. 10,000 కోట్లు రావాలని, ఇంతవరకూ ఏమిచ్చారని ప్రశ్నించారు. ఏపీ నుంచి లెక్కలు సరిగా అందటం లేదని చెప్పటం తప్పించుకోవటమేనని, ప్రతి రాష్ట్రం చీఫ్ సెక్రటరీతో ప్రతి నెలా తాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు చేస్తున్నానని చెప్పుకుంటున్న ప్రధాని ఈ లెక్కలు ఎందుకు అడగటం లేదు? అని ప్రశ్నించారు. ప్రతి కేటాయింపునీ రాజకీయంగానే చేస్తున్నారని, రాష్ట్ర విభజన సమయంలో గత ప్రభుత్వంలాగే ప్రస్తుత ప్రభుత్వంలోనివారు కూడా హామీల్ని గుమ్మరించారని, ఇప్పుడు ఏరు దాటాక తెప్ప తగలేసినట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. విభజన విషయంలో ఏపీకి తగిన న్యాయం జరగలేదని సాక్షాత్తూ ప్రధానే తాజాగా పార్లమెంటులో అంగీకరించారని, న్యాయం చేయాల్సిన బాధ్యత వారి మీదే ఉందని అన్నారు. తెలంగాణకు ఎయిమ్స్‌తోపాటు పలు మౌలికవసతులు ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి అరకొరగా నిధుల్ని విదిల్చారని అన్నారు. ఈ సమస్యలన్నిటి పరిష్కారం కూడా జేఏసీ ఎజెండాలో భాగం కావాలని స్పష్టంచేశారు. తెలుగు రాష్ట్రాల్లో సామరస్య వాతావరణాన్ని ఏర్పరిచేందుకు ముఖ్యమంత్రులు కృషి చేయటం మంచి పరిణామమన్నారు. కాలు మీద కాలు వేసుకుని బతికే వెసులుబాటు ఉన్నా, హీరోగా తనను చూసేందుకు లక్షలమంది డబ్బులు చెల్లిస్తున్నా.. అవన్నీ కాదని పవన్ కళ్యాణ్ చిన్నవయసులోనే కోరి కష్టాలను తెచ్చుకున్నారన్నారు. సమాజం పట్ల పవన్ ప్రేమ, తపనలు ప్రశంసనీయమన్నారు. రాష్ట్రం కోసం పవన్ చొరవను స్వాగతిస్తూ, తెలుగు ప్రజల కోసం కలిసి పనిచేస్తామన్నారు. చట్టబద్ధమార్గంలో, ఇతర రాష్ట్రాలతో వైరుధ్యం లేకుండా విభజన హామీల్ని సాధించుకునే వ్యూహాలను, ప్రణాళికలను చర్చించి కార్యాచరణ చేపడతామన్నారు.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు, జనసేన నేత శంకర్ గౌడ్, లోక్‌సత్తా పార్టీ ఏపీ, తెలంగాణ అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, డా॥ పాండు రంగారావు, వైబీఐ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. ★




### ఆరోగ్యంపై దృష్టి పెట్టటం సంతోషం - కానీ ప్రాథమిక ఆరోగ్యం ముఖ్యం,

# విద్య, వ్యవసాయం గురించి మాట్లాడారంతే.. కేంద్ర బడ్జెట్ 2018పై జేపీ

**కేం**ద్ర బడ్జెట్ 2018-19లో 'ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, అందరికీ మంచి ఆరోగ్యం, రైతుకు ఆదాయం చుట్టూ వ్యవసాయం' అని లోక్‌సత్తా ఎన్నాళ్లగానో చెబుతున్న అంశాలను ప్రధానంగా ప్రస్తావించటం సంతోషకరమని, అయితే ఆ లక్ష్యాలను సాధించే విధానాలు, చిత్తశుద్ధి, కేటాయింపులు మాత్రం కొరవడ్డాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై జేపీ స్పందిస్తూ.. దాదాపు 10 కోట్ల కుటుంబాలకు రూ. 5లక్షల చొప్పున ఆరోగ్య బీమా కవరేజీ సాహసోపేతమైన పెద్ద అడుగని, కానీ ప్రాథమిక వైద్యం, ఫ్యామిలీ డాక్టర్ ఏర్పాటు లేకుండా అమెరికా నమూనాలో తృతీయ స్థాయి వైద్యం, బీమా మీద దృష్టి పెట్టటం వల్ల ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు పెద్దగా మెరుగపడవని అన్నారు. అమెరికా జాతీయ ఆదాయం (జీడీపీ)లో 18శాతాన్ని ఆరోగ్యం మీద ఖర్చు చేస్తారని, అందులో సగం డబ్బును ప్రభుత్వమే భరిస్తుందని, అయినా రోజువారీ వైద్య సేవలు సరిగా అందక ప్రజలు నలిగిపోతున్నారని అన్నారు. మనం ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టి, ప్రాథమిక వైద్యాన్ని, ప్రభుత్వాస్పత్రుల్ని గణనీయంగా మెరుగుపరచుకోకపోతే ఖజానా ఖాళీ అవుతుంది తప్ప ప్రజారోగ్యం బాగుపడదన్నారు.



వ్యవసాయం గురించి పెద్ద మాటలు మాట్లాడారు తప్ప గ్రామీణ ఆర్థికవ్యవస్థను బాగుచేసే సంస్థాగత చర్యలేవీ బడ్జెట్‌లో లేవని జేపీ అన్నారు. పప్పులు, నూనెదినుసుల ధరలు పడిపోతూ దిగుమతులు పెరిగిపోతున్నాయని, 'ఆపరేషన్ గ్రీన్'కు మొక్కుబడి కేటాయింపులతో పరిస్థితిలో పెద్దగా మార్పుండదని అన్నారు. భారీగా పెట్టుబడులు, సాంకేతికత, రైతుకు వినియోగదారునికి మధ్య ప్రమేయాల్ని బాగా తగ్గించి రిటైల్ చెయిన్లను పెద్దఎత్తున తేవటం అవసరమన్నారు. వ్యవసాయంలో భారీ పెట్టుబడి పెడదామనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించే ప్రయత్నమేదీ బడ్జెట్‌లో లేదన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని చాలామేర దాటవేశారన్నారు.

దీర్ఘకాల మూలధన రాబడి (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్)పై పన్నును మనందరం ఆహ్వానించాలని జేపీ అన్నారు. అసమానతల్ని తగ్గిస్తూ ఆదాయాన్ని పెంచే న్యాయమైన పన్ను ఇది.. అన్నారు. పన్నులు చెల్లించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనటానికి మార్కెట్ ప్రతిస్పందనే నిదర్శనమని, కానీ ఆ వసూళ్లను సద్వినియోగం చేయటం, సరైన విధానం ముఖ్యమన్నారు. చమురు ధరల పెరుగుదల, జీఎస్టీ వంటి సవాళ్ల నేపథ్యంలో కూడా స్థూలంగా ద్రవ్య క్రమశిక్షణను పాటించినందుకు ఆర్థికమంత్రిని అభినందించాలన్నారు.

దేశంలో శాంతిభద్రతలు, చట్టం అమలుఅధ్వాన్నంగా ఉన్నా, ప్రజలు రోజువారీ సేవలకు అగచాట్లు పడుతున్నా.. చట్టబద్ధపాలనను, స్థానిక ప్రభుత్వాలను బాగు చేయటం దిశగా ఒక్క మాట కూడా బడ్జెట్‌లో ప్రస్తావించకపోవటం విచారకరమని జేపీ అన్నారు. ప్రజాస్వామ్య భారతదేశం కంటే నియంతృత్వ చైనా స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ సాధికారతనిచ్చిందన్నారు. నగరాలు, పట్టణాల స్థాయి నుంచైనా స్థానిక ప్రభుత్వాలను, కమ్యూనిటీలను, భాగస్వాములను బలోపేతం చేయాలని, లేకుంటే ఎన్ని ఆకర్షణలు అద్దినా నగరాలు క్షీణదశకు చేరుకుంటాయని హెచ్చరించారు. విద్య గురించి, విద్యలో ప్రమాణాల వైఫల్యం గురించి ప్రస్తావించారు తప్ప.. బాగు చేయటానికి నిజాయతీతో కూడిన చర్యలు వేటినీ ప్రస్తావించలేదన్నారు. ఇప్పుడు చేస్తున్న కేటాయింపులతోనే విద్యారంగాన్ని గణనీయంగా మెరుగుపరచవచ్చని, కానీ అందుకు మొక్కుబడి, తాత్కాలిక ఉపశమన మాటలు కాకుండా నిజమైన వ్యవస్థీకృత ఏర్పాట్లు కావాలని జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ★

# సవాళ్లకు స్వీట్ కోటింగ్! (ఆర్థికసర్వే 2017-18)



**ఎగుమతుల పన్నులపై పునరాలోచించాలి**

కొత్త పన్ను (జీఎస్‌టీ) కింద లేదా బయట ఎగుమతుల ఉత్పత్తులపై పడే పలు పన్నుల విషయాన్ని జీఎస్‌టీ మండలి సమీక్షించాలి. వాటిలో పన్నుపై పన్ను పడే అంశాలను తొలగించడం వల్ల ఆ రంగానికి ఊతమివ్వొచ్చు. దుస్తుల రంగానికిచ్చిన రూ.6000 కోట్ల ప్యాకేజీ వల్ల పట్టు, నూలు వంటి ఉత్పత్తులపై సానుకూల ప్రభావం కనిపించినట్టు గణాంకాలు తెలపడం లేదు. అంతర్జాతీయ దుస్తుల ఎగుమతుల విషయంలో చైనా వాటా తగ్గుతున్న నేపథ్యంలో దొరికే అవకాశాలను భారత్ అందిపుచ్చుకోవడం లేదు.

ఆర్థికరంగంలో అచ్చేదిన్ వచ్చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయంటూ ఆర్థికసర్వే ఆశాజనకమైన అంచనాలను ప్రకటించింది. దేశ ఆర్థిక వృద్ధిరేటు 2018-19లో మళ్లీ 7 నుంచి 7.5 శాతానికి దూసుకుపోయే అవకాశముందని తెలిపింది. నిశ్శబ్దంగానే అయినా బలంగా కోలుకొని పట్టాలెక్కిన ఆర్థికరంగం 'ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ'గా మరోసారి సంచలనం సృష్టించే అవకాశం ఉందని పేర్కొంది. ఆర్థికరంగాన్ని కుంగదీసిన పెద్ద నోట్ల రద్దు ప్రభావం సమసిపోయిందని తెలిపింది. వ్యాపార, పారిశ్రామిక రంగాలను కుదిపేసిన జీఎస్‌టీ ఇప్పుడు కుదుటపడిందని పేర్కొంది. కొత్త సంవత్సరంలో ఎగుమతులు పుంజుకుంటాయని, ప్రైవేటు పెట్టుబడుల్లో ఊపు పెరుగుతుందని అంచనా వేసింది. ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ బృందం తయారుచేసిన ఆర్థికసర్వే 2017-18 నివేదికను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆర్థికవృద్ధికి ఆశాజనకమైన అంచనాలను ప్రకటిస్తూనే ఈ దారిలో భారీ సవాళ్లు కూడా పొంచి ఉన్నాయని సర్వే హెచ్చరించింది.

ప్రపంచ వృద్ధి రేటు 2018లో ఒక మోస్తరు స్థాయిలోనే పురోగమిస్తుంది. భారత్‌లో అనుకూలాంశాలున్నా.. పెరుగుతున్న ముడిచమురు ధరలు, అసాధారణ స్థాయిలో పెరిగిన స్టాక్‌మార్కెట్లలో కరెక్షన్ అవకాశాలు.. ఆర్థిక వృద్ధి రేటు జోరును దెబ్బతీసే అవకాశాలున్నాయని సర్వే తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.75శాతంగా ఉంటుందని అంచనా వేసింది. 2016-17లో జీడీపీ వృద్ధి 7.1 శాతం కాగా, 2014-15లో 8 శాతంగా ఉంది. 2017-18కి స్థూలంగా జోడించిన విలువ (జీవీఏ) 6.1 శాతంగా సర్వే వెల్లడించింది. గతేడాది ఇది 6.6 శాతం. జీఎస్‌టీ సాధారణ స్థితికి చేరటం, రెండు రకాల బ్యాలన్స్ షీటుపై చర్యలు, ఎయిరిండియా ప్రైవేటీకరణతో

**వ్యాపార వివాదాల పరిష్కారం వేగవంతం కావాలి**

ప్రభుత్వానికి-న్యాయవ్యవస్థకు మధ్య సహకారం ఉంటే.. వాణిజ్యపరమైన వివాదాల జాప్యం తగ్గించవచ్చు. అప్పీలేట్, కోర్టుల్లో ఈ ఆలస్యాలను పరిహరించి వ్యాపారాలను సులువుగా నిర్వహించుకోవడానికి వీలు కల్పించాలి. వివాదాల పరిష్కారాలను ఆపడం, పెట్టుబడులను నిరుత్సాహపరచడం, ప్రాజెక్టులను ఆపడం, పన్ను చెల్లింపుదారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి వాటిని అడ్డుకోవాలి. ప్రపంచబ్యాంకు ఇచ్చిన సులువుగా వ్యాపారం నిర్వహించుకోవడానికి వీలయ్యే దేశాల జాబితాలో 100వ స్థానానికి భారత్ ఎగబాకినప్పటికీ.. వివాదాల పరిష్కారాల విషయంలో ఇంకా ఎంతో మెరుగుపడాల్సిన అవసరం ఉంది. 2017 నాటికి హైకోర్టుల్లో 35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధాన హైకోర్టుల్లో సగటున ఒక్కో కేసు 4.3 ఏళ్ల పాటు పెండింగ్‌లో ఉంటోంది. ఇక కమిషనర్ (అప్పీళ్లు), సీఈఎస్‌టీఏటీ, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కలిపి మార్చి 2017 త్రైమాసికం చివరకు మొత్తం 1.45 లక్షల అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం కోర్టులు, ట్రైబ్యునళ్లకే ఈ వివాదాల పరిష్కార జాప్యం పరిమితం కావడం లేదు. పన్ను విభాగాల్లోనూ ఈ పరిస్థితులున్నాయి. ప్రభుత్వాలు, కోర్టులు కలిసి భారీ సంస్కరణలను తీసుకురావడం ద్వారా పరిస్థితులను చక్కదిద్దాలి.

## విధాన నిర్ణయాల్లో మహిళల పాత్ర తక్కువే

*రాజకీయ రంగం, విధానపర నిర్ణయాలు తీసుకునే వ్యవహారాల్లో మహిళల పాత్ర తక్కువగా ఉందని ఆర్థికసర్వే తెలిపింది. ఇంటి బాధ్యతలు, సామాజిక ఆర్థిక అంశాలు, కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం లేకపోవడం, నమ్మకం తక్కువగా ఉండటం ఇందుకు కారణాలని విశ్లేషించింది. రువాండాలాంటి ఆఫ్రికన్ దేశంలో 60శాతం మంది ప్రజాప్రతినిధులు మహిళలే ఉన్నారు. భారత్ జనాభాలో 49శాతం మంది మహిళలు ఉన్నప్పటికీ పార్లమెంట్‌లో వారి ప్రాతినిధ్యం 11శాతం మేరే ఉంది. లోక్‌సభలో 64 మంది (11.8శాతం), రాజ్యసభలో 27 మంది (11శాతం) మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా 4,118 మంది ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో మహిళల సంఖ్య కేవలం 8శాతం మాత్రమే. 2010-17 మధ్యకాలంలో పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం కేవలం 1శాతం మాత్రమే పెరిగింది. పంచాయతీ స్థాయిలో మహిళల ప్రాతినిధ్యం బాగానే ఉంది. 43శాతం మంది మహిళా సర్పంచులు ఉండగా, 44.2శాతం మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు.*

## బహిరంగ మలవిసర్జనకు 8 రాష్ట్రాలు దూరం

**ఆరుబయట మలవిసర్జన అలవాటు నుంచి 8 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు పూర్తిగా బయటపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో మరుగు అవసరాల కోసం ఆరుబయలు స్థలాలకు వెళ్లేవారు 2014 అక్టోబర్‌లో 55 కోట్లు ఉంటే, ఇప్పుడు 25 కోట్లకు తగ్గారని సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 296 జిల్లాలు, 3,07,349 గ్రామాలు బహిరంగ మలవిసర్జన నుంచి బైటపడ్డాయి. సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, హర్యానా, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, గుజరాత్, దామన్-దీవ్, ఛండీగఢ్‌లు ఈ అలవాటుకు స్వస్తి చెప్పాయి. బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) గ్రామాల ప్రజలు ఆరోగ్యపరంగానే కాకుండా ఆర్థికంగానూ ప్రయోజనం పొందుతున్నారు. ప్రపంచబ్యాంకు అంచనా ప్రకారం పారిశుద్ధ్య సదుపాయాల లేమి వల్ల భారత్ 6శాతం మేర స్థూల జాతీయోత్పత్తిని నష్టపోతోంది. ఓడీఎఫ్ గ్రామాల్లో ఒక్కో కుటుంబం ఏటా రూ.50వేలు ఆదా చేయగలుగుతుందని యూనిసెఫ్ అంచనా.**

ఆర్థికరంగంలో స్థూల స్థిరత్వం నెలకొంటుందని పేర్కొంది.

ఎన్నికల సంవత్సరం కారణంగానో ఏమో ఆర్థికసర్వే ఎంతో సానుకూలత దృష్టితో మోదీ సర్కారు వైఫల్యాలను ఎత్తిచూపింది. దేశాభివృద్ధికి ప్రధానమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం, న్యాయం తదితర రంగాల్లో ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని స్పష్టంచేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దిగుమతి చేసుకునే చమురు ధరలు సగటున 14 శాతం పెరగ్గా, 2018-19 ఆర్థిక సంవత్సరంలోనూ 10-15శాతం వరకూ పెరిగే అవకాశాలున్నాయని సర్వే అంచనా వేసింది. బ్యారెల్ ధర 10 డాలర్లు పెరిగితే ద్రవ్యోల్బణం 0.3శాతం పెరుగుతుంది. జీడీపీ 0.3శాతం మేర కుంగుతుంది. కరెంటు ఖాతాలోటు మరింత విస్తరిస్తుంది. స్టాక్‌మార్కెట్లలో ఆందోళన మొదలై విదేశీ ఇన్వెస్టర్లు దుకాణాలు సర్దుకునే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలో విధానాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. ఇందులో ఉద్యోగాల సృష్టి ఒకటి. యువతకు, ముఖ్యంగా మహిళలకు మంచి ఉద్యోగావకాశాలు ఉండాలి. విద్యావంతులైన, ఆరోగ్యవంతులైన శ్రామిక శక్తిని సృష్టించటం రెండోది. వ్యవసాయ ఉత్పాదనను పెంచటం మూడోది. వచ్చే ఏడాది ఎన్నికలున్నందున ఆర్థిక నిర్వహణ సవాలుగా ఉంటుంది అని ఆర్థిక సర్వే జాగ్రత్త చెప్పింది.

## రహదారుల పనులు పునఃప్రారంభం

*రహదారుల మంత్రిత్వ శాఖ రూ.3.17లక్షల కోట్ల వ్యయంతో 482 ప్రాజెక్టులు చేపట్టగా అందులో 117 ఆగిపోయాయి. ఇందులో 43 ప్రాజెక్టుల వ్యయం పెరిగింది. ప్రభుత్వం తగిన విధంగా సమస్యలు పరిష్కరించటంతో 88శాతం పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, కాంట్రాక్టర్లు సక్రమంగా పనిచేయకపోవటం, స్థానికుల ఆందోళనలు పనుల్లో జాప్యానికి కారణమవుతున్నాయి. రహదారుల ప్రాజెక్టులకు 2012-13లో రూ.1,27,430 కోట్లు రుణాలివ్వగా, గత సెప్టెంబర్ నాటికి రూ.1,80,277 కోట్లు ఇచ్చారు. ఇదే సమయంలో రుణాల చెల్లింపులు బాగా తగ్గాయి. 2012-13లో బాకీలు 1.9శాతం ఉండగా, ప్రస్తుతం 20.3శాతానికి పెరిగాయి.*

◆ జీఎస్‌టీ అమలు కారణంగా పన్ను చెల్లించేవారి సంఖ్య అదనంగా 18 లక్షలు పెరిగింది. పరోక్ష పన్ను చెల్లింపుదారుల సంఖ్య 50శాతం పెరిగింది. పన్ను పరిధిలోకి 34 లక్షల మంది వ్యాపార సంస్థల నిర్వాహకులు కొత్తగా వచ్చారు. ముఖ్యంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను అందిపుచ్చుకోవడం కోసం చిన్న కంపెనీలు వరుస కట్టాయి. జీఎస్‌టీ కారణంగా ఆదాయపన్ను వసూళ్లు పెరిగాయి. జులైలో రూ.95,000 కోట్లు, ఆగస్టులో రూ.91,000

## వ్యవసాయంలో మహిళాసత్తా

మహిళల ఆధారిత వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరముందని సర్వే సూచించింది. పురుషులంతా పట్టణాలకు వలసలు వెళ్తుండటంతో మహిళలు రైతులు, కూలీల పాత్రలను సమర్ధంగా పోషిస్తున్నారని తెలిపింది. ఆహార భద్రత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్ర విస్మరించలేనిది. అందువల్ల భూమి, నీరు, రుణాలు, సాంకేతిక పరిజ్ఞానం, విత్తనాలు, మార్కెట్ తదితర సౌకర్యాలను మహిళలకు చేరువ చేయాలి. పథకాల లబ్ధిదారుల్లో 30శాతం మంది మహిళలు ఉండేలా ఇప్పటికే ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి.

కోట్లు, సెప్టెంబర్‌లో 91,150 కోట్లు, అక్టోబర్‌లో 83,000 కోట్లు, నవంబర్‌లో 80,808 కోట్లు, డిసెంబర్‌లో 86,703 కోట్లు చొప్పున వసూలయ్యాయి. అత్యధికంగా జీఎస్టీ నమోదులు జరిగిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు గుజరాత్‌లు ఉన్నాయి. పాత పన్ను విధానంతో పోలిస్తే అధికంగా పన్ను నమోదిత వ్యక్తుల సంఖ్య పెరిగిన విషయంలో ఉత్తరప్రదేశ్, పశ్చిమబంగలు ముందు నిలిచాయి. రూ.20లక్షల కంటే ఆదాయపన్ను తక్కువగా ఉన్నప్పటికీ 17 లక్షలమంది వ్యాపారస్తులు జీఎస్టీ పరిధిలోకి చేరారు.

- డిసెంబర్ 2017 నాటికి 98 లక్షలమంది వ్యాపారులు జీఎస్టీలో చేరారు. జీఎస్టీకి ముందు కేంద్రం, రాష్ట్రాల పన్ను వసూళ్లు రూ.9.7 లక్షల కోట్లు ఉండగా, జీఎస్టీ వార్షిక వసూళ్లు రూ.10.9 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా.
- కొత్త దివాలా స్మృతి చట్టం ద్వారా బ్యాంకింగ్ రంగంలోని మొండి బకాయిల సమస్యలను పరిష్కరించడానికి చురుగ్గా ప్రయత్నం చేస్తున్నారు. కొత్త చట్టంలో న్యాయ అంశాల తోడ్పాటు ఎక్కువగా ఉంది. దీని కింద కఠిన సమయ పరిమితులుండటం ఇందుకు నేపథ్యం. దివాలా చట్టం తీసుకువచ్చిన ప్రణాళిక కారణంగా కార్పొరేట్లు తమ బ్యాలెన్స్‌షీట్లను ప్రక్షాళించుకోవడానికి, రుణాలను తగ్గించుకోవడానికి వీలవుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ రంగ పనితీరు ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో స్తబ్దుగా ఉండొచ్చు. సెప్టెంబర్ 30, 2017 నాటికి ఎన్‌బీఎఫ్‌సీ రంగం మొత్తం బ్యాంకు ఆస్తుల్లో 17 శాతాన్ని, బ్యాంకు డిపాజిట్లలో 0.26 శాతాన్ని కలిగివున్నాయి. వీటి ఏకీకృత బ్యాలెన్స్‌షీట్ పరిమాణం 5శాతం (మార్చి 17తో పోలిస్తే సెప్టెంబర్ 17లో) పెరిగి

## కార్మికచట్టాల మెరుగుకు సాంకేతిక పరిజ్ఞానం

**దేశంలో కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సాంకేతిక పరిజ్ఞానం ఉపకరిస్తుందని సర్వే తెలిపింది. పారదర్శకత, జవాబుదారీతనం దీనివల్ల పెరుగుతాయని పేర్కొంది. శ్రమసువిధ పోర్టల్, సార్వత్రిక ఖాతా సంఖ్య, జాతీయ కెరియర్ సేవా పోర్టల్ వంటి వాటిని ప్రస్తావించింది. గ్రామీణ ఉపాధి పథకం కింద 2017-18లో రికార్డుస్థాయిలో 177.8 కోట్ల పనిదినాలతో 4.6 కోట్ల కుటుంబాలకు పని కల్పించారని వెల్లడించింది.**

## మౌలిక వసతులకు 301 లక్షల కోట్లు

దేశంలో రానున్న 25 ఏళ్లలో మౌలిక వసతుల అభివృద్ధికి 4.5 ట్రిలియన్ డాలర్లు (301 లక్షల కోట్లు) అవసరమవుతాయని సర్వే అంచనా వేసింది. ఇందులో 261 లక్షల కోట్లు సొంతంగా సమకూర్చుకోవచ్చని తెలిపింది. ప్రస్తుత పద్ధతుల్లోనే మౌలిక వసతుల కల్పన ఉంటే 2040 నాటికి భారీ కొరత ఉంటుందని స్పష్టంచేసింది. ప్రయివేటు సంస్థల సహకారంతో ఈ కొరతను భర్తీ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్య విధానం విఫలమవడమూ ఇందుకు ఇందుకు ఒక కారణం. భూమి, అడవుల అనుమతులు సకాలంలో రాక ఇంధనం, టెలికాం రంగాల్లో పెట్టుబడులు పెట్టిన ప్రయివేటు కంపెనీలకు నష్టాలు రావటంతో వీటిపై ఆసక్తి తగ్గింది. దేశంలో రహదారుల పొడవు 2001లో 33.73 లక్షల కిలోమీటర్లు ఉండగా 2017లో 57.17 లక్షల కిలోమీటర్లకు పెరిగింది. వాహనాలు 2001 కంటే నాలుగు రెట్లు పెరిగి 2017లో 22.90 కోట్లకు చేరాయి. రహదారుల సాంద్రత చదరపు కిలోమీటరుకి 1.66 కిలోమీటర్లుగా ఉంది. దేశంలో 425 కిలోమీటర్ల మెట్రోరైలు మార్గం ఉంది.

రూ.20.7 లక్షల కోట్లకు చేరింది.

- మార్చి 2017 నుంచి సెప్టెంబర్ 2017 మధ్య వాణిజ్య బ్యాంకుల్లో స్థూల నిరర్థక ఆస్తుల అడ్వాన్సుల (జీఎన్‌పీఏ) నిష్పత్తి 9.6 శాతం నుంచి 10.2శాతానికి పెరిగింది.
- భారీ మొత్తంలో రుణాలు ఎగవేసిన 11 కంపెనీలకు సంబంధించి రూ.3.13 లక్షల కోట్ల విలువైన క్లెయిమ్‌లు దివాలా స్మృతి ప్రక్రియకు చేరాయి.
- ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా ఉంది. 2017-18లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ట స్థాయి 3.3 శాతానికి చేరింది. ఇటీవల కొద్దినెలల్లో

### ఎగుమతుల్లో తెలంగాణ 5వ స్థానం

విదేశాలకు జరిగే ఎగుమతుల్లో దేశంలో తెలంగాణ 5వ స్థానాన్ని సాధించింది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుంచే 70శాతం ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో మహారాష్ట్ర 22.3శాతం, గుజరాత్ 17.2శాతం, కర్ణాటక 12.7శాతం, తమిళనాడు 11.5శాతం, తెలంగాణ 6.4శాతం వాటా కలిగివున్నాయి.


గత దశాబ్ది కాలంలో ఉత్తర తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో, అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీల మేర తగ్గాయి. దక్షిణ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రలో 0.25 నుంచి 0.75 డిగ్రీల దాకా పెరిగాయి. దేశంలో 18 హరిత విమానాశ్రయాల నిర్మాణానికి కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. వాటిలో తెలంగాణలోని కొత్తగూడెం, ఉత్తరాంధ్రలోని భోగాపురం, సీమలోని ఓర్వకల్లు ఉన్నాయి. సేవల వృద్ధిలో ఏపీ 21వ స్థానంలో ఉండగా తెలంగాణ ఆరో స్థానంలో ఉంది.

### మగపిల్లాడు పుట్టేంత వరకూ వేచిచూస్తున్నారు

**మగపిల్లాడు పుట్టేంత వరకూ పిల్లల్ని కంటూ ఉండే సంప్రదాయం చాలామందిలో కొనసాగుతోంది. దీనివల్ల ఆడపిల్లల సంఖ్య అవాంఛితంగా పెరుగుతోంది. ఇలాంటివారు దాదాపు 2.10 కోట్ల మంది ఉంటారని అంచనా. లింగనిష్పత్తిలో అసమానతల వల్ల 6.30 కోట్ల మంది మహిళలు గల్లంతయ్యారు. దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. ఉపాధి, గర్భనిరోధక సాధనాల వాడుక, పాప-బాబులను సమానంగా చూడటంలో మాత్రం వెనకబడే ఉంది. పనిచేసే మహిళల సంఖ్య 2005-06లో 36శాతం ఉంటే, 2015-16నాటికి అది 24శాతానికి తగ్గిపోయింది. మహిళలను విద్య, ఆరోగ్య రంగాలలో ప్రోత్సహించటానికి రాష్ట్రాలు, ఇతర భాగస్వామ్య సంస్థలు కీలకపాత్ర పోషించాలి.**

ఆహార ద్రవ్యోల్బణం పెరిగింది. ఇందుకు కూరగాయలు, పండ్ల ధరలు కారణం.

- 2017-18లో రాష్ట్రాలవారీగా ద్రవ్యోల్బణాన్ని చూస్తే.. చాలావరకు రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గింది. 17 రాష్ట్రాల్లో ద్రవ్యోల్బణం 4శాతం లోపే నమోదు కావచ్చు.
- పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు ఎక్కువ ఎగుమతులు చేసిన రాష్ట్రాలు ఆర్థికంగా ఎక్కువ పుష్టిగా ఉన్నాయి. అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు కూడా మిగతా రాష్ట్రాల్లోవారి కంటే మెరుగ్గా ఉన్నాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబర్‌లో భారత కంపెనీలు ప్రాథమిక మార్కెట్ల ద్వారా రూ.70,000 కోట్లకుపైగా నిధులను సమీకరించాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 45శాతం ఎక్కువ. ఇందులో రూ.66,420 కోట్లు ఈక్విటీ. మిగతా రూ.3896కోట్లు రుణమార్గంలో సమీకరించినవి.
- వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడానికి భారత్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి (ఎంఎస్‌ఎంఈ) కంపెనీలకు సరైన రుణ సదుపాయాలు లభించటం లేదు. మొత్తం రుణాల జారీలో ఈ రంగానికి కేవలం 17.4శాతం వాటానే దక్కుతోంది. సూక్ష్మ, చిన్న కంపెనీలకిచ్చే రుణాల్లో వృద్ధి 4.6శాతం పెరగ్గా.. మధ్యస్థాయి వాటికి 8.3శాతం వరకు తగ్గింది. 2016-17లో ప్రధాన్‌మంత్రి ముద్ర యోజన కింద ఇచ్చిన రుణాలు లక్ష్యాన్ని (రూ.1.8 లక్షల కోట్లు) అధిగమించాయి. ఇందులో రూ.1.23 లక్షల కోట్లు బ్యాంకులివ్వగా.. రూ.57,000 కోట్లు బ్యాంకింగేతర సంస్థలిచ్చాయి.




- ఇన్వెస్టర్ల నుంచి మ్యూచ్యువల్ ఫండ్లకు మంచి స్పందన వచ్చింది. 2016-17లో వీటిలో పెట్టుబడులు 400 శాతం మేర పెరిగాయి. బ్యాంకు డిపాజిట్లు, జీవిత బీమా ఫండ్‌లు, షేరు, డిబెంచర్లలోకి వెళ్లిన పెట్టుబడులు వరుసగా 82 శాతం, 66 శాతం, 345 శాతం చొప్పున పెరిగాయి.
- భారీ రుణాలతోపాటు కాల్స్, డేటా విషయంలో ఛార్జీల యుద్ధం వల్ల నష్టాలు పెరిగిపోతుండటం వల్ల ఆదాయం తగ్గి టెలికాం సంస్థలు తీవ్ర

### వ్యవసాయ విధానాల్లో మార్పులు తప్పనిసరి

రైతుల ఆదాయంపై వాతావరణ మార్పులు 25శాతం వరకూ ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని ఆర్థికసర్వే హెచ్చరించింది. సగటున ప్రతి రైతుకు 15-18శాతం, వర్షాధార భూములవారికి 25శాతం ఆదాయం తగ్గుతుందని విశ్లేషించింది. స్థూలజాతీయోత్పత్తిలో వ్యవసాయం వాటా తగ్గుతున్నా.. ప్రగతికి చోదకశక్తిగానే ఉంటుందని తెలిపింది. వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీళ్లందించటం భవిష్యత్తులో సవాలుగా మారనుంది.


- అధిక వర్షాల కారణంగా ఖరీఫ్‌లో - పప్పుధాన్యాలు (18శాతం), జొన్న, వరి (15శాతం), వేరుసెనగ (14శాతం), రబీలో - కంది (10శాతం), ఆవాలు (4శాతం) పంటల్లో ఉత్పాదకత తగ్గింది.
- ఒకే ఏడాదిలో ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే సగటున ఖరీఫ్‌లో రైతుకు 6.2శాతం, రబీలో 6శాతం వరకు వర్షాధార భూముల్లో ఆదాయం తగ్గుతోంది. సాధారణంకన్నా 100 మిల్లీమీటర్ల వర్షపాతం తగ్గితే ఖరీఫ్‌లో 15, రబీలో 7శాతం ఆదాయాన్ని రైతులు కోల్పోతున్నారు. ఈ శతాబ్దం ఆఖరు నాటికి దేశంలో 3 నుంచి 4 డిగ్రీల వరకు సగటు ఉష్ణోగ్రత పెరిగే అవకాశాలున్నాయి.
- వర్షాకాలంలో ఒకసారి వర్షం కురిసిన రోజు నుంచి.. మరోరోజు వర్షం పడే వరకు ఉండే కాలమే పొడి విరామం. ఇది ఎన్నిరోజులు గరిష్ఠంగా ఉందనే అంశాన్ని బట్టి పంటల ఉత్పాదకతలో మార్పులు వస్తాయి. 1970-2015 మధ్యకాలంలో దేశంలో పొడివిరామం 42 నుంచి 45శాతానికి పెరిగాయి.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి వ్యవసాయరంగంలో సంస్కరణలకు జీఎస్‌టీ మండలి తరహాలో యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆర్థిక సర్వే సూచించింది. విద్యుత్తు, ఎరువుల రాయితీలకు బదులు ప్రత్యక్ష నగదు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. బిందుతుంపర్ల సేద్యం, ఆధునిక సాంకేతిక పద్ధతుల వినియోగంలో వేగంగా పురోగతి, బీమా విస్తరణ, పంట నష్టం అంచనాలకు డ్రోన్ల వినియోగం, పాడి, మత్స్య, ఇతర అనుబంధ రంగాలలో రైతులకు ఆదాయావకాశాలను కల్పించటం చేయాలని పేర్కొంది.

ఒత్తిడికి గురవుతున్నాయి. టెలికాం రంగంలోని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) అధికంగా వస్తున్నాయి.

- చట్టపరమైన వివాదాల వల్ల అవరోధాలు ఎదురవుతున్నాయి. నూతన టెలికాం విధానంలో వీటికి పరిష్కారాలు చూడాలి.
- పర్యాటకరంగానికి 2017లో 27.7 బిలియన్ డాలర్ల విదేశీ మారకం లభించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 20.8 శాతం ఎక్కువ. ప్రభుత్వం ఈ రంగం కోసం తీసుకున్న పలు చర్యలు ఇందుకు దోహదం చేశాయి. 2017లో మొత్తం 1.02 కోట్ల మంది విదేశీ పర్యాటకులు వచ్చారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 15.6శాతం ఎక్కువ. 2016లో వీరి ద్వారా వచ్చిన విదేశీ మారక నగదు 22.9 బిలియన్ డాలర్లుగా ఉంది. 163 దేశాల పౌరులకు ఇ-వీసా అమలు, అంతర్జాతీయ స్థాయిలో మాధ్యమాల్లో ప్రచారం, 'ద హెరిటేజ్ ట్రయల్' పేరు మీద వినూత్న కార్యక్రమం.. తదితరాల వల్ల భారత్ విదేశీ పర్యాటకులను ఆకర్షించింది.
- తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటకలు పర్యాటకులను ఆకర్షించటంలో తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. 2016లో వచ్చిన విదేశీ పర్యాటకుల్లో 61.3 శాతం మంది ఈ రాష్ట్రాలకే వచ్చారు.
- ప్రయాణీకుల టికెట్ల విక్రయాలపరంగా ప్రపంచంలో మూడో అతిపెద్ద, శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ విమానయాన విపణి మనదే. ఇప్పటివరకూ విమానసేవలు పొందని, అత్యంత స్వల్పంగా లభిస్తున్న వారి కోసం ప్రాంతీయ విమానయాన పథకం (ఉడాన్) ప్రారంభించి, పలు మార్గాలు వివిధ సంస్థలకు కేటాయించారు. గిరాకీకి అనుగుణంగానే చిన్న విమానాశ్రయాల పునరుద్ధరణ, అభివృద్ధి ఉంటుంది. విమానయాన సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఇందులో కీలకం. ఈ ఏడాది డిసెంబర్‌లోగా 50 విమానాశ్రయాల అభివృద్ధికి రూ.4,500కోట్లు ఖర్చు చేస్తున్నారు.
- దేశంలో నీటికొరత పెరుగుతోంది. చైనా, అమెరికాలకన్నా రెట్టింపు స్థాయిలో భూగర్భ జలాలు తోడేస్తుండటంతో గత 30 ఏళ్లలో 13శాతం తగ్గిపోయాయి.
- వర్షాకాలంలో అత్యంత వేడిగా ఉండే రోజులు 4.8 నుంచి 6.5శాతానికి పెరిగాయి. మరోవైపు చల్లగా ఉండే రోజులు 7 నుంచి 3 శాతానికి తగ్గాయి.
- వ్యవసాయరంగ వృద్ధి రేటు ఈ ఏడాది 2.1శాతంగా నమోదయ్యే అవకాశముంది. తయారీరంగం 8శాతం నమోదు చేయవచ్చు.
- సేవల రంగంలో ఎఫ్‌డీఐ 15శాతం పెరిగింది.
- పెద్ద నోట్ల రద్దు వల్ల ఆర్థిక పొదుపు పెరిగింది, పొదుపు అలవాట్లు కూడా మారాయి. ★


# వృద్ధిరేటు 6.5శాతమే




దేశ ఆర్థిక వ్యవస్థ ప్రగతి నెమ్మదించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి నాలుగేళ్ల కనిష్టానికి పడిపోవచ్చని కేంద్ర గణన కార్యాలయం (సీఎస్‌వో) అంచనా వేసింది. ఈ గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ వృద్ధి రేటు 6.5శాతానికి తగ్గే అవకాశముంది. 2016-17లో జీడీపీ వృద్ధి రేటు 7.1శాతం కాగా, అంతకుముందు రెండేళ్లు 8, 7.5శాతం నమోదైంది. జాతీయాదాయంపై ఇది తొలి ముందస్తు అంచనా అని, స్థూల విలువ జోడింపు (జీవీఏ) కూడా 6.1శాతానికి పరిమితం కావొచ్చని సీఎస్‌వో తెలిపింది. 2016-17లో జీవీఏ 6.6శాతంగా ఉంది. వ్యవసాయ రంగ వృద్ధి 4.9శాతం నుంచి 2.1శాతానికి తగ్గే అవకాశముందని వెల్లడించింది. అలాగే తయారీరంగం పురోగతి కూడా 7.9శాతం నుంచి 4.6శాతానికి నెమ్మదించవచ్చు. జీడీపీ వృద్ధి తగ్గటానికి ఈ రెండు రంగాల పేలవ ప్రదర్శనే కారణమని తెలిపింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ కూడా ప్రభావం చూపాయి.

దేశ ప్రజల జీవన ప్రమాణాలకు అద్దం పట్టే తలసరి ఆదాయం 2017-18లో 8.3శాతం క్షీణించి రూ.1,11,782కి పరిమితమయ్యే అవకాశముందని సీఎస్‌వో వెల్లడించింది. 2016-17లో తలసరి ఆదాయం 9.7శాతం పెరిగింది. వాస్తవ రూపేణా (2011-12 ధరల వద్ద) తలసరి ఆదాయం రూ.86,660గా ఉండొచ్చని పేర్కొంది. కాగా, దేశ విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు దాదాపు రూ.26,60,000కోట్లకు చేరాయి.

# పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న దేశాల్లో.. అసమానతలు అధికంగా ఉన్నది మనదేశంలోనే



ఉపాధి లేమి, ఆర్థిక మందగమనానికి తోడు దేశంలో ఆర్థిక అసమానతలు కూడా పెరిగిపోతున్నాయి. ధనిక-పేద అంతరం అంతకంతకూ ఎక్కువవుతోంది. ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చిన సంపద కేవలం కొందరు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. గత మూడున్నర దశాబ్దాలకాలంలో భారత్‌లో ఆర్థిక అంతరాలు బాగా పెరిగిపోయాయని 'ప్రపంచ అసమానతల నివేదిక-2018' స్పష్టం చేసింది. పారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లోని ప్రపంచ అసమానతల ప్రయోగశాల దీన్ని రూపొందించింది.

- ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఐరోపాలో అసమానతలు తక్కువగా ఉన్నాయి. భారతదేశంతోపాటు పశ్చిమాసియా దేశాల్లో అసమానతలు మరీ ఎక్కువగా ఉన్నాయి.
- 1980 తర్వాత భారత్‌లో ఆర్థిక హెచ్చుతగ్గులు బాగా పెరిగాయి.
- ఆర్థిక అసమానతలు రష్యాలో ఒక్కసారిగా పెరిగిపోయాయి.

ప్రపంచ అసమానతల నివేదిక ప్రకారం భారతదేశంలో ఆర్థిక అసమానతలు గరిష్టస్థాయికి చేరుకున్నాయి.

- 2014లో జాతీయ సంపదలో 22శాతం 1శాతం ధనికుల నుంచి సమకూరింది. అదేసమయంలో 10శాతం ధనికుల చేతిలో 56శాతం జాతీయ సంపద పోగుపడింది.
- 2016లో సహారా దిగువ ఆఫ్రికా దేశాలు, బ్రెజిల్ స్థాయిలో మనదేశంలోనూ ఆర్థిక అసమానతలు అధికంగా ఉన్నాయి.
- దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత కొన్నేళ్లు అంతరాలు తక్కువగానే ఉన్నాయి. కింద స్థాయి వర్గాల ఆదాయం, జాతీయ సగటు ఆదాయం కంటే ఎక్కువగా పెరిగింది. కానీ గత మూడు దశాబ్దాల్లో ఇందుకు భిన్నమైన పరిస్థితి ఏర్పడింది.
- పెద్ద ఆర్థిక వ్యవస్థలుగా ఉన్న దేశాల్లో అసమానతలు అధికంగా ఉన్నది మనదేశంలోనే.
- సమర్థమైన పంపిణీ విధానాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, లేనిపక్షంలో ఇది సామాజిక అశాంతికి తావు ఇస్తుందని నివేదిక పేర్కొంది.
- ప్రజల ఆదాయం, సంపద గణాంకాలను ప్రభుత్వం మరింత పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉందని తెలిపింది.

# అసమానతల్లో ప్రపంచానికి భిన్నంగాలేని భారతీయ సంస్కృతి


## - ఆక్స్‌ఫాం సర్వేదీ అదే మాట -

భారత్‌లో డబ్బున్నవారికి, పేదవారికి మధ్య అంతరం నానాటికీ పెరిగిపోతోందని ఆక్స్‌ఫాం (హక్కుల సంస్థ) తాజా సర్వే కూడా హెచ్చరించింది. సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే, పేదలు నిరుపేదలుగా మారుతున్నారు. గత ఏడాది దేశంలో జరిగిన సంపద సృష్టిలో 73శాతం కేవలం ఒక శాతం మంది చేతిలో కేంద్రీకృతమై ఉంది. అంతకుముందు సంవత్సరం 58 శాతం సంపద ఆ ఒక శాతం మంది చేతుల్లోకి వెళ్లింది. ఏటేటా అంతరం వేగంగా విస్తరిస్తోందని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఒక శాతం సంపన్నుల సంపద 2017లో 20.9లక్షల కోట్ల రూపాయల మేర పెరిగింది. 2017లో కొత్తగా 17మంది బిలియనీర్లు వచ్చి చేరారు. దీంతో భారత్‌లో బిలియనీర్ల సంఖ్య 101కి పెరిగింది. బిలియనీర్ల మొత్తం సంపద 20.7లక్షల కోట్లు. వారి సంపద 4.89 లక్షల కోట్లు పెరిగింది. ఈ సొమ్ము దేశంలోని 29 రాష్ట్రాలకూ విద్య, వైద్యాలకు ఖర్చు చేసే బడ్జెట్‌తో సమానం. బిలియనీర్లలో 37శాతం మందికి కొడుకులుగా వారసత్వ రూపంలో ఈ ఆదాయం సమకూరింది. బిలియనీర్ల మొత్తం సంపదలో సగం వీరిదే. బిలియనీర్లలో నలుగురే మహిళలు.. వీరికి కూడా తమ సంపద వారసత్వంగా వచ్చింది. ఇదే కాలంలో దేశంలోని 67 కోట్లమంది ప్రజల సంపద కేవలం ఒక శాతం మాత్రమే పెరిగిందని సర్వే స్పష్టంచేసింది. వీరంతా పేద, నిమ్న వర్గాలవారు. భారత్‌లోని ఓ వస్త్ర సముదాయ సంస్థలోని అత్యున్నత స్థాయి వ్యక్తి ఏడాది సంపాదనను అందుకోవాలంటే- ఓ మామూలు రోజువారీ కార్మికుడు 941 సంవత్సరాలు కష్టపడాలి. సర్వే నివేదికను 'రివార్డ్ వర్క్ అండ్ నాట్ వెల్త్' (పనిని గుర్తించు.. సంపదని కాదు) పేరుతో వెలువరించారు. ఆక్స్‌ఫాం మొత్తం 10 దేశాల్లో 1,20,000మందిని సర్వే చేసి వివరాలు వెల్లడించింది. అంతర్జాతీయంగానూ ఆర్థిక అసమానతలు ఎక్కువగానే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా గతేడాది జరిగిన సంపదసృష్టిలో 82శాతం కేవలం ఒక శాతం మంది చేతిలో కేంద్రీకృతమైనట్టు సర్వే తెలిపింది. 370 కోట్లమంది పేద ప్రజల సంపదలో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. 2017లో ప్రపంచవ్యాప్తంగా బిలియనీర్ల సంఖ్య కూడా ఊహించని రీతిలో పెరిగింది. రెండు రోజులకో బిలియనీర్ తయారవుతున్నాడు. 2010 నుంచి ఏటా బిలియనీర్ల సంపద 13శాతం మేర పెరుగుతోంది. ఇది కార్మికుల వేతనాల కంటే ఆరు రెట్లు వేగంగా పెరుగుతోంది.

- మూలధన పంపిణీ సక్రమంగా లేకపోవటమే ఆర్థిక అసమానతలకు ప్రధాన కారణం. జాతీయ సంపద పెరిగినప్పటికీ ప్రజలు మాత్రం పేదవాళ్లుగానే ఉన్నారు.
- ప్రస్తుత విధానాలే కొనసాగితే 2050 నాటికి వివిధ దేశాల్లో ఆర్థిక అంతరాలు ఇంకా పెరిగిపోతాయి. ★

# కేంద్ర బడ్జెట్ 2018-19

ఆరోగ్యం, విద్యలకు ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను ఓట్ల రూపంలో నొల్లు కునేందుకు, జనాభాలో అత్యధికులు నివసిస్తున్న గ్రామీణ భారతాన్ని ఆకట్టుకునేందుకు పెద్ద ప్రయత్నం చేస్తూ 2018-19 వార్షిక బడ్జెట్‌ను రూ. 24.42 లక్షల కోట్ల అంచనాతో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. కానీ విధానాలు అసంబద్ధంగా ఉండటం, ఆచరణలో స్పష్టత లేకపోవటంతో బడ్జెట్ కేవలం మరో అంకెల గారడీగానే మిగిలిపోయే ప్రమాదముందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లకు ఉన్నకొద్దీ ప్రాధాన్యత తగ్గుతున్నప్పటికీ.. ప్రభుత్వ దిశానిర్దేశానికి అద్దం పడతాయి. జనాకర్షక పథకాల ప్రస్తావన లేకుండా ప్రజలకు మౌలికమైన ఆరోగ్యంపై దృష్టి పెట్టటం, విద్యలో నాణ్యత గురించి ప్రస్తావన




### *ఆపరేషన్ గ్రీన్స్‌కు రూ.500 కోట్లు*

*త్వరగా పాడైపోయే బంగాళదుంప, టమాటా, ఉల్లి వంటి పంటల ధరల్లో అనూహ్య హెచ్చుతగ్గుల సమస్య పరిష్కారానికి 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో రూ. 500 కోట్లు కేటాయించారు. వ్యవసాయంలో కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించిన ఇతర చర్యలు..*

- *కౌలురైతులకు రుణ సౌకర్యం లభించేందుకు వీలుగా తగిన యంత్రాంగం నీతి ఆయోగ్ ద్వారా ఏర్పాటు.*
- *ఔషధ, సుగంధ మొక్కల సాగుకు, సంబంధిత పరిశ్రమకు రూ. 200 కోట్లు కేటాయింపు.*
- *వినియోగదారులకు రైతులు నేరుగా విక్రయించుకొనేందుకు, టోకు కొనుగోళ్లకు వీలుగా 22,000 గ్రామీణ సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు (గ్రామ్స్)గా అభివృద్ధి చేయడం.*
- *గ్రామ్స్, 585 మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ. 2,000 కోట్లతో నిధి ఏర్పాటు. మార్కెట్ కమిటీల నిబంధనల నుంచి గ్రామ్స్‌కు మినహాయింపు.*
- *ఆకుపచ్చ బంగారమైన వెదురు రంగాన్ని సమగ్రంగా ప్రోత్సహించేందుకు రూ. 1290 కోట్లతో పునర్వ్యవస్థీకరించిన జాతీయ వెదురు కార్యక్రమం ప్రారంభం. అటవీయేతర భూముల్లో పెంచే వెదురుకు చెట్ల నిర్వచనం నుంచి మినహాయింపు.*
- *పెద్ద క్లస్టర్లలో సేంద్రియ సాగు చేసే ఫార్మర్ ప్రొడ్యూసర్ సంస్థ (ఎఫ్‌పీవో)లు, గ్రామీణ ప్రొడ్యూసర్ సంస్థ (వీపీవో)లకు ప్రోత్సాహం.*
- *జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కింద మహిళా స్వయం సహాయక సంఘాలు కూడా సేంద్రియ సాగు చేసేలా ప్రోత్సాహం.*
- *వాయుకాలుష్యంతో సతమతమవుతున్న హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీకి తోడ్పాటునందించడానికి, పంట వ్యర్థాల సమస్య పరిష్కారానికి అవసరమయ్యే యంత్రాలను రాయితీపై అందించడానికి ప్రత్యేక పథకం.*
- *సాగునీటిని పొదుపుగా వాడుతూ పంటల ఉత్పాదకతను పెంచేందుకు రూ. 4వేల కోట్లను ప్రకటించారు. దేశవ్యాప్తంగా 40 లక్షల ఎకరాల్లో బిందు సేద్యం పరికరాల ఏర్పాటుకు నిధుల్ని వెచ్చిస్తారు. ప్రధానమంత్రి కృషి సంచయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకం ద్వారా ఈ నిధులిస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెరో రూ. 250 కోట్లు ఇందులో వచ్చే అవకాశముంది.*

చేయటం, వ్యవసాయ భద్రతకు రైతు భద్రత ముఖ్యమని గుర్తించటం మాత్రమే ఈసారి బడ్జెట్ ప్రత్యేకతలుగా కనిపిస్తున్నాయి.

ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచిపోయేలా.. దేశంలో 50 కోట్ల మంది పేదలకు (డెబ్బై ఏళ్లుగా పలు సంక్షేమ పథకాలు

## పంటల బీమాకు తక్కువే

పంటల బీమా అమలుకు తగినన్ని నిధుల్ని బడ్జెట్‌లో కేటాయించలేదు. 2018-19కి రూ.13వేల కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ప్రధానమంత్రి పంటల బీమా పథకం (పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (డబ్ల్యుబీసీఐ) పథకం పేరుతో రెండు రకాలుగా అమలు చేస్తున్నారు. కేంద్రం విధించిన లక్ష్యాలకు తెలుగు రాష్ట్రాలు దూరంగా ఉండటంతో నిధులు తక్కువగా రానున్నాయి. 2016-17 బడ్జెట్‌లో పీఎంఎఫ్‌బీవై పథకానికి రూ.5,500 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈ సొమ్ముతో దేశవ్యాప్తంగా 30శాతం విస్తీర్ణానికి బీమా చేయించాలన్నది లక్ష్యం. ఏపీలో 22, తెలంగాణలో 10శాతం విస్తీర్ణానికే రైతులు ప్రీమియం కట్టారు. దేశం మొత్తమ్మీద 30శాతం విస్తీర్ణానికి రైతులు ప్రీమియం కట్టారని ఇందుకోసం చివరికి రూ.13,240 కోట్లు సవరించిన 2017-18 బడ్జెట్‌లో ఇచ్చినట్టు కేంద్రం వెల్లడించింది. దీన్నిబట్టి తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన 50 శాతం విస్తీర్ణం కవరేజీకి రూ.13వేల కోట్ల కేటాయింపు చాలదని స్పష్టంగానే తెలుస్తోంది.

## నగదు రహిత పథకం

మోదీకేర్‌గా వ్యవహరిస్తున్న జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం (ఎన్‌హెచ్‌పీఎస్) నగదు రహిత పథకం. ప్రస్తుతమున్న రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనను పునర్వ్యవస్థీకరించి దీనిని తీసుకొస్తున్నారు. అయితే దీని విధివిధానాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. వెల్‌నెస్ పేరుతో ఏర్పాటు చేసే ఆరోగ్య కేంద్రాలను కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద దత్తత తీసుకోవాలని కార్పొరేట్ సంస్థలకు, దాతృత్వ సంఘాలకు కేంద్రం విజ్ఞప్తి చేసింది. వైద్య ఆరోగ్యంలో బడ్జెట్ ప్రతిపాదించినవి ఇంకొన్ని..

◆ నాణ్యమైన వైద్య విద్య, ఆరోగ్య పరిరక్షణ లభ్యతను పెంచేందుకు.. దేశంలో ప్రస్తుతమున్న జిల్లా ఆస్పత్రుల స్థాయిని పెంచడం ద్వారా కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలను, ఆస్పత్రులను ఏర్పాటు చేస్తారు.

◆ దీనివల్ల ప్రతి రాష్ట్రంలోనూ మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు కనీసం ఒకటి చొప్పునైనా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడుతుంది.

◆ ఇతర అంటువ్యాధులకన్నా క్షయతో ఏటా ఎక్కువ మరణాలు చోటు చేసుకుంటున్నాయి. పేదలు, పోషకాహారలోపం ఉన్నవారే దీనికి ఎక్కువగా బాధితులవుతున్నారు. అందువల్ల క్షయ వ్యాధిగ్రస్తులందరికీ.. చికిత్సకాలంలో నెలకు రూ.500 చొప్పున అందిస్తారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.600 కోట్లు కేటాయించారు.

## తెలుగు రాష్ట్రాలకు పన్నుల వాటాలో 16శాతం వృద్ధి

కేంద్ర పన్నుల్లో గత ఏడాది కంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు లభించే వాటా 2018-19 ఆర్థిక సంవత్సరంలో 16శాతం పెరగనుంది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలకు కేంద్రం ఆర్థిక సంవత్సరంలో రూ.7.88 లక్షల కోట్ల పన్నుల డబ్బును పంచనుండగా, అందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.33,929.84 కోట్లు కేటాయింపు అవుతాయి. 2017-18 కంటే ఇది 16.99శాతం అధికం. తెలంగాణకు రూ.19,207.43 కోట్లు దక్కనున్నాయి. ఇది గత ఏడాది కంటే రూ.16.97 శాతం అధికం. మొత్తం పన్నుల్లో ఏపీకి 4.305 శాతం, తెలంగాణకు 2.437 శాతం వాటా రానుంది. 2018-19లో సెంట్రల్ జీఎస్టీలో రాష్ట్రాలకు వాటా భారీగా పెరగనుంది. గత ఏడాది ఈ పద్దు కింద అన్ని రాష్ట్రాలకు రూ.92,988 కోట్లు లభించగా, 2018-19లో రూ.2,53,638 కోట్లకు పెరగనుంది. ఇది 272శాతం అధికం. ఐజీఎస్టీ, కస్టమ్స్ సుంకాల్లో వాటా గత ఏడాది కంటే ఈసారి భారీగా తగ్గింది.

అమలు చేస్తున్నా పేదరికం ఇంత పెద్దఎత్తున కొనసాగుతోందని ఒప్పుకున్నారు) 'జాతీయ ఆరోగ్య రక్షణ పథకం' తీసుకొస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో తెచ్చే ఈ పథకంలో భాగంగా.. తృతీయ స్థాయి వైద్యానికి పెద్దపీట వేస్తూ 10 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున కవరేజీ అందిస్తారు. రూ.1200 కోట్లతో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు

## భారీగా ఇళ్ల నిర్మాణం

అందరికీ 2022 నాటికల్లా గృహవసతి కల్పించాలనే లక్ష్యంలో భాగంగా పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలను ప్రకటించారు.

◆ జాతీయ హౌసింగ్ బ్యాంకులో అందుబాటు ధరల గృహాల నిధి (ఏహెచ్ఎఫ్) ఏర్పాటు. ప్రభుత్వ అధీకృత బాండ్లు, ఇతర మార్గాల ద్వారా దీనికి నిధులు సమీకరిస్తారు.

◆ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ ప్రాంతాల్లో 2018-19లో 51 లక్షల ఇళ్ల నిర్మాణం. ఇప్పటికే 2017-18లో 51 లక్షల ఇళ్లు కేటాయింపు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కోటికిపైగా ఇళ్ల నిర్మాణానికి అవకాశం ఏర్పడుతుంది.

◆ పట్టణ ప్రాంతాల్లో 37 లక్షల గృహాల నిర్మాణానికి సాయం.

## రహదారులకు కేటాయింపులు పెంపు

*మౌలిక వసతుల కల్పనలో భాగంగా రోడ్ల నిర్మాణానికి కేంద్రం నిధుల్ని పెంచింది. గత బడ్జెట్‌లో రూ.64,900 కోట్లు కేటాయించగా, ఈసారి రూ.71వేల కోట్లకు పెంచారు.*

◆ *'భారతమాల పరియోజన' పథకం తొలిదశలో భాగంగా 5.35 లక్షల కోట్లతో 35 వేల కిలోమీటర్ల పొడవైన రహదారులను నిర్మించనున్నారు.*

◆ *ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం మూడో దశ కింద గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి రూ.19వేల కోట్లు కేటాయించారు.*

## కృత్రిమ మేధ పథం

*కృత్రిమ మేధస్సు రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించటం కోసం ఒక జాతీయ కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఈ బాధ్యతను ప్రభుత్వం నీతి ఆయోగ్‌కి అప్పగించింది.*

## పల్లెలకూ డిజిటలీకరణ

భారత్‌ను సాంకేతిక విజ్ఞాన సమాజంగా మార్చే లక్ష్యంలో భాగంగా..

◆ డిజిటల్ ఇండియా కార్యక్రమానికి నిధుల్ని రెట్టింపు చేస్తూ రూ.3,703 కోట్లు కేటాయించారు.

◆ అత్యున్నత విద్యాకేంద్రాల ఏర్పాటుకు చేయూతనిచ్చే సైబర్ ఫిజికల్ వ్యవస్థ (సీపీఎస్)లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

◆ గ్రామాల్లో 5 లక్షల వైఫై హాట్‌స్పాట్ కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయం. దీంతో 5 కోట్ల మంది గ్రామీణులకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

◆ టెలికాం రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయింపు.

◆ మద్రాస్ ఐఐటీలో దేశీయ 5జీ ప్రయోగ కేంద్రం ఏర్పాటు.

◆ బ్లాక్‌చైన్ టెక్నాలజీకి ప్రోత్సాహం.

## తీర ప్రాంత భద్రతకు..

దేశవ్యాప్తంగా 60 జెట్టీల నిర్మాణం, 225 బోట్లు కొనుగోలు చేయనున్నట్టు చెప్పారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ మెరైన్ పోలీస్ స్టేషన్లకూ లబ్ధి చేకూరనుంది. అలాగే అమరావతిలో నిర్మిస్తున్న అత్యాధునిక ఫోరెన్సిక్ ప్రయోగశాల నిర్మాణానికి కేంద్రం రూ.152 కోట్లు కేటాయించింది.

## మహిళా పథకాలకు నాలుగు శాతం పెంపు

మహిళా సంక్షేమం, ప్రగతి లక్ష్యంగా ఉన్న పథకాలకు కేటాయింపుల్ని నాలుగు శాతం పెంచారు. జాతీయ పౌష్టికత మిషన్‌కైతే మూడు రెట్లు పెంచి రూ.3,000కోట్లు కేటాయించారు. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం రూ.1,17,221.47 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.1,21,961.32 కోట్లు ప్రకటించారు.

చేస్తారు (జాతీయ వైద్య మిషన్‌లో భాగంగా 2017లోనే ఈ వెల్‌నెస్ సెంటర్లను ప్రకటించారు).

వ్యవసాయానికి దన్నుగా నిలిచేందుకు సేంద్రియ సాగు, పశుపోషణ, గ్రామీణ గృహనిర్మాణం, మత్స్యరంగ అభివృద్ధికి రూ.14.34 లక్షల కోట్లతో పలు పథకాలను హామీ ఇచ్చారు. ఉత్పత్తి వ్యయానికి కనీసం 150 శాతం అధికంగా ఉండేలా అన్ని వానాకాలం పంటల మద్దతు ధరలు పెంచుతామన్నారు. వ్యవసాయ రుణాలను రూ.11లక్షల కోట్లకు పెంచారు. ఇది

## ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల అభివృద్ధి

**నవోదయ విద్యాసంస్థలతో సమానంగా ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల (ఈఎంఆర్ఎస్)లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. గిరిజనులను 2022నాటికి పూర్తి అక్షరాస్యులను చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పథకం అమలు బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాలదే. గత ఏడాదితో పోలిస్తే ఎస్సీ, ఎస్టీలకు కేటాయింపులు రూ.3900 కోట్లు, రూ.6627 కోట్లు పెరిగాయి.**

## నాణ్యమైన విద్యానినాదం

*దేశంలో ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఆధునిక వసతుల కల్పన, ఉన్నత విద్యలో సంస్కరణలు, డిజిటలీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది. ఉన్నత విద్యాసంస్థలు నిధులకొరతను అధిగమించేందుకు కొత్త మార్గాన్ని ప్రతిపాదించింది. పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల శిక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ ఏకీకృత బీఎడ్ కార్యక్రమాన్ని ముందుకు తెచ్చింది.*

- *విద్యావ్యవస్థల మౌలిక సదుపాయాల పునరుత్తేజం (రైజ్) కింద వచ్చే నాలుగేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు ప్రతిపాదించారు. దీనికోసం ఉన్నత విద్య పెట్టుబడుల సంస్థ (హెచ్ఈఎఫ్ఏ) ఆవిర్భవించనుంది.*
- *కొత్తగా రెండు పూర్తిస్థాయి స్పా (స్కూల్స్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్)ల స్థాపన. స్వయంప్రతిపత్తిగల మరో 18 స్పాలను ఐఐటీలు, ఎన్ఐటీల ప్రాంగణాల్లో నెలకొల్పటం.*
- *దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో బీటెక్ చదివే వెయ్యిమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రధానమంత్రి విశిష్ట సభ్యత్వ (ఫెలోషిప్) పథకం కింద ఐఐటీలు, ఐఐఎస్సీల్లో పీహెచ్డీలు చేసే అవకాశం.*
- *జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎన్టీయేకు మాత్రం కేవలం రూ.10 కోట్లు కేటాయించారు.*

## ముద్రా కింద రూ.3లక్షలు కోట్లు

**ముద్రా యోజన కింద వచ్చే ఏడాదిలో రూ.3లక్షల కోట్లు రుణాలుగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిధుల అవసరం, వ్యాపార వృద్ధి, పరిణామక్రమం ఆధారంగా శిశు, కిషోర్, తరుణ్ పేర్లతో విభజించి ఈ రుణాలనిస్తారు.**

గత ఏడాది కన్నా లక్ష కోట్లు అధికం. కిసాన్ క్రెడిట్ కార్డును మత్స్యకారులకు, పశుపోషణ రంగంలోని రైతులకు కూడా వర్తింపచేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి రూ. 2,000కోట్లు కేటాయించారు. వ్యవసాయోత్పత్తుల ఎగుమతులను సరళీకరిస్తామన్నారు. రూ. 100 కోట్లు, అంతకంటే ఎక్కువ టర్నోవర్‌ను నమోదు చేసే వ్యవసాయోత్పత్తుల కంపెనీలకు తొలి ఐదేళ్లకు వందశాతం పన్ను మినహాయింపు ప్రకటించారు. ఉచిత వంటగ్యాస్ (ఎల్పీజీ) కనెక్షన్ లబ్ధిదారుల సంఖ్యను ఇప్పుడున్న 5 కోట్ల నుంచి 8 కోట్లకు పెంచారు. నాలుగు కోట్ల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌ను అందించనున్నామని తెలిపారు. విద్య, ఆరోగ్య, సామాజిక పరిరక్షణ రంగాలకు రూ. 1.38 లక్షల కోట్లను కేటాయించారు. బ్లాక్‌బోర్డు నుంచి డిజిటల్‌బోర్డుకు పరివర్తన చెందే విధంగా దేశ విద్యారంగాన్ని మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆర్థికమంత్రి చెప్పారు. ఈ మేరకు ప్రీ-నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒక సమగ్ర విద్యావిధానాన్ని తీసుకొస్తామన్నారు. అయితే దీని గురించి వివరాలు వెల్లడించలేదు.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 80,000కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అభివృద్ధి సూచికలుగా 115 జిల్లాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.

### సెస్సు పెంపు

పన్ను వర్తించే అన్ని రకాల ఆదాయంపై విధిస్తున్న విద్య, ఆరోగ్యం సెస్సును ఇప్పుడున్న మూడు శాతం నుంచి నాలుగు శాతానికి పెంచారు. సామాజిక సంక్షేమ పథకాలకు అవసరమైన నిధుల కోసం పది శాతం సామాజిక సంక్షేమ సర్‌ఛార్జీని ప్రవేశపెట్టారు. రూ. 250 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న సూక్ష్మ, చిన్న మధ్యతరహా వ్యాపార సంస్థలపై విధిస్తున్న కార్పొరేట్

### ఉపాధికి ఊతం

ఉద్యోగావకాశాల సృష్టి తమ కీలక ప్రాధాన్యమని ప్రభుత్వం చెప్పింది.

- అన్ని రంగాల్లోని కొత్త ఉద్యోగుల వేతనాల్లో 12శాతం ఈపీఎఫ్ చందాను వచ్చే మూడేళ్లు ప్రభుత్వం భరిస్తుంది.
- స్థిరకాల ఉద్యోగిత సౌకర్యం అన్ని రంగాలకూ వర్తింపు.
- ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద 1.5 లక్షల ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, జాతీయ ఆరోగ్య సురక్ష పథకం వంటి కార్యక్రమాలతో లక్షల ఉద్యోగాల సృష్టి.
- గ్రామీణ, మౌలిక వృద్ధి రంగాలకు భారీ కేటాయింపులతో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల సృష్టి.
- చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కేటాయింపులు, కార్పొరేట్ పన్నుల తగ్గింపు ప్రతిపాదన, ప్రధానమంత్రి ముద్ర యోజన, జాతీయ వెదురు మిషన్, జీవనోపాధి మిషన్‌లకు తగినన్ని కేటాయింపులతో ఉద్యోగ కల్పన.
- ఉద్యోగిత సృష్టి, వృద్ధికి తోడ్పడేందుకు 2018-19లో మౌలికరంగంలో ప్రభుత్వ బడ్జెటరీ, అదనపు బడ్జెటరీ వ్యయాలు పెంపు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయంఉపాధి, ఉద్యోగావకాశాలతోపాటు 321 కోట్ల పనిదినాల ద్వారా కూడా ఉపాధి అందించే ప్రయత్నం.
- ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర కార్యక్రమం ద్వారా ప్రతి జిల్లాలోనూ ఆదర్శ నైపుణ్య కేంద్రాల ఏర్పాటు.
- పాదరక్షల తయారీ కేంద్రాల్లోలా పరిశ్రమలు తక్కువ కాలపరిమితికి ఉద్యోగులను నియమించుకునే అవకాశాన్ని అందుబాటులోకి తేవటం.

### తెలుగు రాష్ట్రాలకు అత్తెసరే

రాష్ట్ర విభజన చట్టంలో ఏపీకి చెప్పిన సంస్థలకు బడ్జెట్‌లో స్వల్పంగా కేటాయించారు. ఇవ్వాల్సిన నిధుల్లో కేవలం నాలుగు శాతమే ప్రతిపాదించారు. తెలంగాణలో ఎయిమ్స్ ఊసే లేదు. తెలంగాణ రూ.34,000కోట్ల ప్రతిపాదనలు పంపగా, వాటిని కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నామమాత్రపు సాయం అందించటం తెలుగు రాష్ట్రాల మీద ఎక్కువ ప్రభావం చూపింది. అయితే రాష్ట్రాలకిచ్చేవాటన్నిటినీ బడ్జెట్‌లో చూపలేమని, ఏపీ, తెలంగాణలకిచ్చే వాటాలు, సాయాలూ యథావిధిగా న్యాయంగానే అందుతాయని కేంద్రం ప్రతినిధులు వాదిస్తున్నారు.

### రైల్వే భద్రతపై దృష్టి, విమానాశ్రయాల అభివృద్ధి

రైల్వేలో వ్యవస్థాగత సామర్థ్యం పెంపు, భద్రతకు కేంద్రం పెద్దపీట వేసింది. 2018-19 బడ్జెట్‌లో ఆ శాఖకు మూలధన వ్యయంగా రూ.1,46,500కోట్లు కేటాయించింది. గతేడాది సవరించిన బడ్జెట్ అంచనాల కంటే ఇది 22శాతం ఎక్కువ. రైల్వేకు కేటాయింపుల్లో రూ.53,060 కోట్లను కేంద్రం బడ్జెట్ ద్వారా సమకూరుస్తుంది. హవాయి చెప్పులు వేసుకునేవారూ విమాన ప్రయాణం చేసేలా ఏఏఐ ఆధ్వర్యంలో విమానాశ్రయాల సంఖ్యను 124 నుంచి 620కి పెంచుతారు.

పన్నును ఇప్పుడున్న 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. ఎక్సయిజ్ డ్యూటీ, సేవా పన్నులను జీఎస్‌టీలోనే కలిపిన నేపథ్యంలో కస్టమ్స్ డ్యూటీలో మాత్రమే మార్పులను ఆర్థికమంత్రి ప్రకటించారు. దీనివల్ల విదేశాల నుంచి దిగుమతి చేసుకునే సెల్‌ఫోన్లు, పర్‌ఫ్యూమ్‌లు, వాచీలు, ఆటోమొబైల్ పరికరాలు, సన్‌గ్లాసెస్, ట్రక్కు టైర్లు, పాదరక్షలు, వజ్రాలు తదితర సరకులపై కస్టమ్స్ డ్యూటీ పెరిగింది. ఏడాదికిపైగా అట్టిపెట్టుకున్న షేర్ల విక్రయం ద్వారా ఆర్జించే రూ.లక్షకు పైగా ఆదాయం (లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్)పై పన్నును పునరుద్ధరించారు. ఈ పన్నును రద్దు చేసిన 14 ఏళ్ల తర్వాత

## కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

| 2016-17 | 2017-18 | 2017-18 | 2018-19 | |
|---|---|---|---|---|
| | వాస్తవ గణాంకాలు | బడ్జెట్ అంచనాలు | సవరించిన అంచనాలు | బడ్జెట్ అంచనాలు |
| రెవెన్యూ వసూళ్లు | 13,74,203 | 15,15,771 | 15,05,428 | 17,25,738 |
| మూలధన వసూళ్లు | 6,00,991 | 6,30,964 | 7,12,322 | 7,16,475 |
| మొత్తం వసూళ్లు | 19,75,194 | 21,46,735 | 22,17,750 | 24,42,213 |
| మొత్తం వ్యయం | 19,75,194 | 21,46,735 | 22,17,750 | 24,42,213 |
| రెవెన్యూ లోటు | 3,16,381 | 3,21,163 | 4,38,377 | 4,16,034 |
| కోశ లోటు | 5,35,618 | 5,46,531 | 5,94,849 | 6,24,276 |
| ప్రాథమిక లోటు | 54,904 | 23,453 | 64,006 | 48,481 |

తిరిగి తీసుకొచ్చారు. ఈక్విటీ మ్యూచ్యువల్ ఫండ్స్ నుంచి పంపిణీ చేసిన ఆదాయంపై 10శాతం పన్ను విధిస్తున్నట్టు ప్రకటించారు.

ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తాం

జీడీపీని త్వరలోనే 8శాతం దాటిస్తామని ఆర్థికమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.5 శాతం నుంచి 6.75 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ 2.5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకున్నదని, త్వరలోనే ప్రపంచంలో ఏడో స్థానం నుంచి ఐదో స్థానానికి చేరుకుంటామని అన్నారు.

రక్షణ రంగానికి 7.81 శాతం పెంపు

దేశ రక్షణ రంగ కేటాయింపులను 7.81 శాతం పెంచి రూ. 2.95 లక్షల కోట్లు చేశారు.

వేతన వర్గాలకు లభించని ఊరట

ఆదాయపు పన్ను శాతాలు, శ్లాబులను మార్చడం లేదని మంత్రి చెప్పారు. ఉద్యోగులు, పింఛనుదార్లకు ప్రస్తుతం కల్పిస్తున్న రవాణా, వైద్య ఖర్చుల మినహాయింపు బదులు ప్రామాణిక తగ్గింపు ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. రూ. 40,000 స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రూ. 19,200 వరకూ రవాణా అలవెన్స్ మీద, రూ. 15,000 వరకూ ఉన్న వైద్య ఖర్చుల మీద పన్ను విధించడం లేదు. ఈ రెండింటినీ కలిపి ప్రస్తుతం రూ. 40వేలకు పెంచారు. సీనియర్ సిటిజన్లకు బ్యాంకు, పోస్టాఫీసు డిపాజిట్లపై వచ్చే వడ్డీ మీద విధించే పన్ను మినహాయింపును ఇప్పుడున్న రూ. 10 వేల నుంచి రూ. 50 వేలకు పెంచారు. తీవ్రమైన అస్వస్థతకు లోనైనప్పుడు చికిత్సకు చేసే వ్యయంపై విధించే పన్ను మినహాయింపును రూ. లక్షకు పెంచారు.

చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు పన్నును తగ్గించారు. అత్యంత సంపన్నులపై ఉన్న 10-15శాతం పన్నును మాత్రం అలాగే కొనసాగించారు. విద్య, వైద్య సెస్సును ఇప్పుడున్న మూడు నుంచి నాలుగు శాతానికి పెంచారు.

ద్రవ్యలోటు కొంత సడలింపు

ద్రవ్యలోటు కట్టడికి ఆర్థికమంత్రి గట్టి ప్రయత్నమే చేసినప్పటికీ, నిధుల కొరతతో కొంత సడలింపునిచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్రవ్యలోటును ముందు అనుకున్న దానికన్నా పెంచారు. ద్రవ్యలోటును జీడీపీలో 3.2 శాతానికి కట్టడి చేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, ఇప్పుడు దానిని 3.5 శాతానికి పెంచారు. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2018-19) ద్రవ్యలోటును కూడా తొలుత మూడు శాతానికే పరిమితం చేయాలని భావించినప్పటికీ ఇప్పుడు 3.3 శాతానికి పెంచారు. వచ్చే ప్రతి రూపాయిలో 19 పైసలు అప్పు రూపంలోనిది. ★

# నీతి ఆయోగ్‌కి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా 2016 ఏప్రిల్‌లో అందించిన 'అందరికీ ఆరోగ్యం' విధానం నమూనాలోని ముఖ్యాంశాలు




ఢిల్లీ నుంచి గ్రామం వరకు ప్రజల జేబులో నుంచి రూపాయి ఖర్చులేకుండా మనదేశంలో 'అందరికీ ఆరోగ్యం' అందించటం కోసం లోక్‌సత్తా/ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) రూపొందించిన నమూనా విధానాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ తన బృందంతో కలిసి ఏప్రిల్ 25, 2016న నీతి ఆయోగ్ ముందు ప్రజెంట్ చేశారు. అంతకుముందు ఈ నమూనాపై న్యూఢిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీహెచ్ఎఫ్ఐ) అధ్యక్షుడు డా॥ కె.శ్రీనాథ్‌రెడ్డితోపాటు వైద్య ఆరోగ్య రంగంలో అనుభవమున్న నిపుణులు చర్చలో పాల్గొన్నారు. ప్రపంచ దేశాల అనుభవాల్ని అధ్యయనం చేసి భారతీయ పరిస్థితులకనుగుణంగా జేపీ రూపొందించిన జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం)ను గ్రామీణ హెల్త్ మిషన్‌గా కుదించి పలు పరిమితులతో 2005లో యూపీయే ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. జాతీయ హెల్త్ మిషన్ రూపకర్తగా, ప్రపంచ దేశాల విధానాలను మారిన పరిణామాలకనుగుణంగా తిరిగి అధ్యయనం చేసి తాజా దేశీయ ఆరోగ్య నమూనా విధానాన్ని జేపీ రూపొందించారు. ప్రభుత్వ బాధ్యతతో అమలయ్యే ఈ విధానానికి ప్రైవేటు, కార్పొరేట్ రంగం చిక్కులు సృష్టించకుండా వారిని కూడా చాలావరకు ఒప్పించారు. ఇందుకోసం పలు సమావేశాల్ని నిర్వహించారు. పలు ఆస్పత్రుల్ని సందర్శించారు.

ఇప్పుడు కూడా .. 2018-19 బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకంలోని లోపాలు దేశ ఖజానాకు, ప్రజారోగ్యానికి ఎంత నష్టం చేకూరుస్తాయో వివరిస్తూ, ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థతో కూడిన ప్రాథమిక ఆరోగ్యం తదితర సూచనలను బడ్జెట్ పరిధిలోనే అందించేందుకు నీతి ఆయోగ్‌తోపాటు పలువురు నేతలు, ప్రజాప్రతినిధులతో జేపీ మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో 2016లో నీతి ఆయోగ్‌కు ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా సమర్పించిన అందరికీ ఆరోగ్యం విధానం నమూనాలోని ముఖ్యాంశాలు..

ప్రాథమిక స్థాయిలో జీతాల విధానం బదులు నచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్‌ను ప్రజలు ఎంచుకునే విధానం

లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ నమూనాలో గ్రామస్థాయి నుంచి ప్రతి కుటుంబానికి కొంతమంది ఫిజీషియన్లు అందుబాటులో ఉంటారు. వీరికి జీతాలిచ్చే వ్యవస్థ లేకుండా, సేవలతో పోటీపడి సంపాదించుకునే విధానం ఉంటుంది. వీరు ఎంబీబీఎస్ చదివి ఫ్యామిలీ ఫిజీషియన్లుగా శిక్షణ పొందినవారై ఉంటారు. ఈ వైద్యులు తాము ఎంపికచేసుకున్న గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలు తమ వైద్యసేవలు తీసుకునేట్టుగా రిజిస్టర్ చేసుకుంటారు. రిజిస్టర్ అయిన ఒక్కో వ్యక్తికీ వైద్యసేవల కోసం ప్రభుత్వం కాస్త అటూఇటుగా ఏటా రూ.600 వైద్యునికి చెల్లిస్తుంది. ఎంత ఎక్కువమంది ప్రజలను వైద్యుడు/వైద్యురాలు నమోదుచేసుకుంటే అంత ఎక్కువ ఆదాయం వారికి వస్తుంది. ఇలా ఓ మెరుగైన వైద్యునికి ఏడాదికి రూ.30లక్షలకు పైగా కనీస ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. గ్రామాలలో సేవలందించటానికి వారు గ్రామంలో నివాసముండాల్సినే నిబంధన ఉండదు. అందుబాటులో ఉండేలా సమీప పట్టణంలో ఉండవచ్చు. పట్టణాల్లో, నగరాల్లో విపరీత పోటీని ఎదుర్కొంటున్న వైద్యులకు ఇది సువర్ణావకాశమే అవుతుంది. ఇక్కడ జెనెరిక్ మందుల్ని ఉచితంగా అందిస్తారు, టీకాలు వంటి కార్యక్రమాల్ని చేస్తారు. ప్రభుత్వం జీతాలిచ్చే ప్రస్తుత వ్యవస్థకు ఇది విప్లవాత్మకమయిన ప్రత్యామ్నాయం.


రెండోదశలో తాలూకా స్థాయిలో ప్రభుత్వ కమ్యూనిటీ సెంటర్లు-ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య పోటీ

రెండోదశ వ్యాధుల చికిత్సలో తాలూకా స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, ప్రయివేటు నర్సింగ్ హోంలకు మధ్య పోటీ ఉంటుంది. ప్రసూతి కేసుల దగ్గర్నుంచి

ఎవరు మెరుగైన చికిత్సనందిస్తే, సేవలనందిస్తే వారికి ఆకర్షణీయ చెల్లింపులు ఉండేలా ఈ దశలో ఏర్పాటు ఉంటుంది. ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డుల్ని నమోదు చేసి మొత్తం దేశ ఆరోగ్యరికార్డుని తయారుచేస్తారు. ఇప్పటివరకూ ప్రభుత్వం కేవలం కొన్ని రకాల

## అభివృద్ధికి ప్రధాన సంకేతం ఆరోగ్యం

- డా॥ జయప్రకాష్ నారాయణ్



*అభివృద్ధికి ప్రధాన సంకేతం మనిషి ఆరోగ్యం. కానీ మనదేశంలో ఇప్పటికీ అకాల మరణాలు, నివారించదగ్గ వ్యాధులు, సులభంగా చికిత్స చేయదగ్గ జబ్బులు అసంఖ్యాకంగా అమాయకుల్ని బలితీసుకుంటున్నాయి. నివారించదగ్గ క్లేశాలు భారతదేశంలో ఉన్నంతగా మరెక్కడా కానరావు. ఇందుకు చాలా సులభ పరిష్కారాలు మన ముందున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో అమలయ్యే మార్గాలనేకం ఉన్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో డాక్టర్ అరోలీ దంపతులు దశాబ్దాల క్రితం తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఆరోగ్య ఫలితాలు చూస్తే– మన సమస్యలను ఎంత సులభంగా పరిష్కరించవచ్చో విశదమవుతుంది. వెల్లూరు వైద్య కళాశాలలో పట్టభద్రులయిన డాక్టర్ రజనీకాంత్ అరోలీ, ఆయన భార్య మేబెల్– ఇరువురూ అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి 1970లో మహారాష్ట్రలో మారుమూల ప్రాంతమయిన జాంఖేడ్‌లో నివాసమేర్పరచుకున్నారు. ఆ దంపతులకు ఆనాటికే ఓ విషయం స్పష్టంగా తెలిసివచ్చింది. నూటికి 90 జబ్బులకు ఖరీదయిన వైద్యం అక్కర్లేదు. ఎన్నో అంటువ్యాధులను సులభంగా గుర్తించి చికిత్స చేయవచ్చు. చాలా రోగాలకు వ్యాధి నిరోధక టీకాలిస్తే జబ్బు రాకుండా నివారించవచ్చు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో రకాల జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. పౌష్టికాహారం మెళకువలను పాటిస్తే చాలా వ్యాధులను నిరోధించవచ్చు. మాతాశిశుసంరక్షణ సూత్రాలను పాటిస్తే ఎందరో గర్భిణులను, పసిపాపలను రక్షించవచ్చు. వీటన్నింటికీ వైద్యులే అవసరం లేదు. అలాగని అసలు వైద్యులు అవసరమే లేదని కాదు. కొన్ని క్లిష్టమయిన వ్యాధులను గుర్తించడానికి, సరైన చికిత్స చేయటానికి, శస్త్రచికిత్సలకు, కొన్ని మందుల వాడకానికి విధిగా వైద్యులు కావాలి. ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణనివ్వటం కోసం, వైద్యుడి సహాయం అవసరమున్న రోగులకు చికిత్సనందించటం కోసం జాంఖేడ్‌లో అరోలీ దంపతులు ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వారి కృషి వల్ల అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు వచ్చాయి. 1970ల చివరినాటికి ఆ 70 గ్రామాలలోని లక్ష జనాభాకు ఆధునిక ఆరోగ్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఆ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు–జీవన కాలపరిమితి, మాతా శిశు మరణాలు, వివిధ వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య వగైరా అంశాలలో– ప్రపంచంలో సంపన్న దేశాలకు ఏరకంగానూ తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించగలిగారు. 1979లో అరోలీ దంపతులకు మెగసెసే అవార్డు అందింది. ఆరో పంచవర్ష ప్రణాళికకు ఆరోగ్యరంగంలో జాతీయ సలహాదారుగా అరోలీని మన ప్రభుత్వం నియమించింది. ఆయన కృషిని అందరూ పొగిడారు. కాగితం మీద ఆ విధానాలనే రాసిపెట్టారు. కానీ వాస్తవానికి ప్రజలకు ఆరోగ్యం అందకుండా చేశారు. గ్రామీణ మహిళలను ఎంపికచేసి శిక్షణనిచ్చేది పోయి, పలుకుబడి గలవాళ్ల పిల్లలను ఎంపికచేశారు. ప్రజలకు ఆరోగ్యం అందించే లక్ష్యంతోకాక ప్రభుత్వోద్యోగం దక్కి నెల జీతం వస్తుందనే ఆశతో వేలమంది యువకులు లంచాలిచ్చి ఆరోగ్య కార్యకర్తలుగా చేరారు. నాయకులకు, అధికారులకు చిత్తశుద్ధి, సంకల్పం, అవగాహన, సామర్థ్యం కొరవడటంతో ఆ పథకం నీరుగారిపోయింది. ఇప్పుడు పాలకులలో చాలామందికి అసలు అరోలీ పేరే తెలియదు. గూండాలకు నీరాజనాలందించి, లంచగొండులను నెత్తికెక్కించుకుని, అసమర్థులను అందలాలెక్కించే వ్యవస్థలో నిజంగా దేశాన్ని సమూలంగా సంస్కరించగల మహనీయుల కృషి ఫలితాలను పొందే విజ్ఞత కూడా కరవయింది. చీటికీమాటికీ వేలు, లక్షలు ఖర్చు చేసి ఖరీదయిన ఆసుపత్రులలో వైద్యం పొందగల సంపన్నులకు, నిజాం ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందే అవకాశమున్న నాయకులకు, అధికారులకు సామాన్యుల కడగండ్లు కానరావు. లక్షలమంది పేదలు, అల్పాదాయ వర్గాలవారు చిన్నచిన్న జబ్బులకు కూడా సరైన వైద్యసౌకర్యం లేక, వైద్యం అందుబాటులో లేక సతమతమవుతున్నారు. సంపన్నులు, విద్యావంతుల కంటే చిన్న రుగ్మతలకు పేదలు ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. అమూల్యమయిన కాలాన్ని పోగొట్టుకుంటున్నారు. జబ్బు పడుతున్నామనే భావనే సగటు మనుషుల్ని కుంగదీస్తోంది. ఒక్కోసారి జబ్బుపడితే– సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం ఉండాలేగానీ, అతి తక్కువ ఖర్చుతో, స్థానికుల సహకారంతో ఎవరికీ తీసిపోని ఆరోగ్య ప్రమాణాలను సాధించటం చిటికెలో పని. ఆ ఫలితాలను అందరికీ అందించటం నాగరికులమనుకునే మన ప్రథమ కర్తవ్యం. బీదరికాన్ని నిర్మూలించాలంటే ఆరోగ్యాన్ని అందరికీ అందించే వ్యవస్థను నిర్మించాలి. ఒక వ్యక్తి పుట్టుక, కులం, హోదా, ఆస్తిపాస్తులు.. ఇందులో దేనితోనూ సంబంధం లేకుండా సహేతుకమైన, సరైన ప్రమాణాలుగల వైద్యసదుపాయాలు అందరికీ అందాలి.*

*(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 2002, 2004లో ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల నుంచి)*

జబ్బులకు మాత్రమే పీపీపీ నమూనాలో ప్రయివేటు వైద్యులకు చెల్లిస్తోంది. లోక్‌సత్తా నమూనాలో ఏ జబ్బుకైనా మెరుగైన ఆసుపత్రిని ఎంపికచేసుకునే అవకాశం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.




తృతీయ దశలో జిల్లాస్థాయిలో ఎయిమ్స్‌లాంటి ప్రభుత్వ వైద్యసంస్థలు

వ్యాధి తృతీయదశలో జిల్లా స్థాయి వైద్య సంస్థలుంటాయి. ఈ దశ చికిత్సలో ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ ఉంటుంది కాబట్టి ఇక్కడ కార్పొరేట్ భాగస్వామ్యానికి అవకాశం లేకుండా ఈ నమూనాలో ఏర్పాట్లు ఉంటాయి. ఎయిమ్స్ (ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) వంటి సంస్థలను, తక్కువ ఖర్చుతో మెరుగైన సేవల్ని అందించే శంకర నేత్రాలయ, నారాయణ హృదయాలయ వంటివాటిని మాత్రమే ప్రోత్సహిస్తారు. ఇప్పుడు జరుగుతున్నట్టు ప్రభుత్వం నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు వేలకోట్లు పంచిపెట్టటం ఉండదు.

◆ గ్రామాల్లో కుటుంబ వైద్యుల ప్రాక్టీస్‌కు అనుమతినిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాంతీయ ఆరోగ్య ట్రస్టు ఉంటుంది. వైద్యసేవలను పర్యవేక్షించేందుకు జిల్లా బోర్డులు, తప్పు జరిగితే విచారణకు అంబుడ్స్‌మన్‌లు ఉంటాయి.

◆ లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యం నమూనా సరిగ్గా అమలయితే భారం లేకుండా అందరికీ వైద్యం, ఆరోగ్యం అందటమే కాకుండా, యువతకు రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కూడా లభ్యమవుతాయి.

తాము ప్రతిపాదిస్తున్న అందరికీ ఆరోగ్యం నమూనాను అమలు చేస్తే వచ్చే 2022నాటికి ప్రాథమిక, నివారించదగ్గ వైద్యసేవలకు రూ.80,000 కోట్లు, రెండోదశ సేవలకు రూ.40,000కోట్లు, తృతీయదశ సేవలకు రూ.93,000కోట్లు ఖర్చవుతాయని జేపీ ఈ సందర్భంగా తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కూడా అంచనావేసి లెక్కిస్తే మొత్తం రానున్న ఏడేళ్లలో (దశలవారీ పెరుగుదలతో) రూ.3.5 – 3.8 లక్షల కోట్లు ఖర్చవుతాయని, ఇది జీడీపీలో కేవలం 1.67శాతం మాత్రమే ఉంటుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీ కంటే కూడా తక్కువ ఖర్చుచేస్తే చాలని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరోగ్య రంగానికి నిధుల్ని జాతీయ ఆదాయంలో 2.5శాతానికి పెంచుతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పగా, 2.3 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ఎన్నికల హామీల్లో పేర్కొన్నాయని, లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన నమూనాలో ఇప్పుడు ఖర్చు చేస్తున్న 1.1శాతానికి మరో 0.5శాతం కలిపి పెంచితే అందరికీ ఆరోగ్యం అందుతుందని వివరించారు. మనదేశంలో ఉన్న వైద్యసిబ్బంది నైపుణ్యాలు, చౌకగా మందుల తయారీ, సాంకేతికత, ప్రజల్లో డిమాండ్ వంటి సానుకూల అంశాలను ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఈ విధానాన్ని రూపొందించినట్టు చెప్పారు.

భారత ఆరోగ్యరంగానికున్న సంక్షోభానికి మూలం వ్యాధుల చికిత్సకన్నా నివారణకు కీలకమైన ప్రాథమిక ఆరోగ్య దశలో వైఫల్యమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. గ్రామాలలో వైద్యసేవలు అందకపోవటం, ఏ జబ్బుచేసినా జిల్లా స్థాయి ఆసుపత్రులకు, బోధనాసుపత్రులకు రావాల్సిఉండటంతో ప్రయివేటు, కార్పొరేటు దోపిడీకి ప్రజలు బలవుతున్నారన్నారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన విధానంలో ఈ ప్రాథమిక వైద్యరంగంలో పూర్తిగా స్వేచ్ఛా మార్కెట్ పోటీ ఉంటుందని, ఎంతమంచి సేవలు అందించి ఎంతమంది ప్రజలను ఆకట్టుకుంటే ఆ వైద్యునికి అంత ఎక్కువ ఆదాయం లభిస్తుందని వివరించారు.

అందరికీ ఆరోగ్యం ఇవ్వాలని 12వ పంచవర్ష ప్రణాళికలో (2012–17) హామీ ఇచ్చినా ఒక నమూనాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయానికి రాకపోవటం వల్ల ఇప్పటికీ ఆ కీలక సంక్షోభం అలాగే కొనసాగుతూ ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది మరణిస్తున్నారని, 97 లక్షలమంది మలేరియా బారిన పడుతున్నారని, 25లక్షల మందికి టీబీ సోకుతోందని, ఆసుపత్రుల పాలయినవారు సగటున ఒక్కొక్కరూ రూ.40,000 ఖర్చు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో కేవలం 0.5శాతం పెంచితే ఈ దేశానికి అద్భుతాలు జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ఆమాత్రం కూడా బడ్జెట్‌ను పెంచలేమని అంటే, ఇక ప్రభుత్వాలు అక్కర్లేదన్నారు. తాయిలాలు, రుణమాఫీలు వంటి పథకాలుకాకుండా అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం ఉచితంగా ప్రభుత్వమే అందించే బాధ్యత తీసుకుంటేనే పేదరికం, వివక్ష తొలగిపోయి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు వస్తాయని తొలినుంచీ వాదిస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కొన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించిందని, తాజాగా పూర్తిస్థాయి ఫలితాల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

కేంద్ర, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో, పార్టీలతో కూడా కూర్చుని నిర్మాణాత్మక వాదనలతో ఒప్పించి సరైన పద్ధతుల్లో, భారం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని సాధించేందుకు దృఢసంకల్పంతో ప్రయత్నిస్తున్నామని, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాలని, జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

(నీతి ఆయోగ్ ద్వారా మోదీ ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన అందరికీ ఆరోగ్యం విధానం నమూనా పూర్తి వివరాల్ని www.fdrindia.org లో చూడవచ్చు) ★

# ప్రధానమంత్రి పదవికన్నా పౌరసత్వం గొప్పది

- 70 ఏళ్లలో దేశం ఎదగాల్సినంతగా ఎదగలేదు
- మన రాజ్యాంగ నిర్మాణంలోనే లోపాలున్నాయి
- మనకంటే చైనాలో ప్రజాస్వామ్యం ఎక్కువ
- లోక్‌సత్తా విఫలప్రయోగం కాదు



డాక్టర్‌గా నాడిపట్టారు...

కలెక్టర్‌గా కొత్త ఒరవడి తెచ్చారు...

లోక్‌సత్తా అంటూ రాజకీయాల్లోకి దిగి... ప్రజల నాడి పట్టుకోవాలని చూశారు

ఎన్నికల ఫలితం నిరాశ మిగిల్చినా తనలో ఆశయంపై ఇంకా ఆశ తగ్గలేదంటున్నారు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్!

దేశ స్థితిగతులపై...

లోక్‌సత్తా భవిష్యత్‌పై

తన తప్పిదాలపై... ఈనాడు 'హాయ్'తో అంతరంగాన్ని ఆవిష్కరించారాయన!

**చాలాకాలంగా ఎక్కడా ఎక్కువగా వినిపించటం లేదు. రాజకీయాలకు దూరమయ్యారా? లేక విసుగెత్తిందా?**

పక్షపాత రాజకీయం, ఎన్నికల రాజకీయానికి దూరంగా ఉన్నా! మార్పు కోరుకుంటున్న రాజకీయంలో మాత్రం ఇప్పటికీ పూర్తిగా మిళితమై ఉన్నా! రాజకీయమనేది ఎన్నికల్లో పోటీ చేసేవాళ్ల గురించీ, ఓట్లు వేసేవారి గురించీ కాదు. మన గురించి, మన బిడ్డల బతుకుల గురించి! అలాంటి రాజకీయానికి నేనెప్పుడూ దగ్గరే!

### లోక్‌సత్తా నాకోసం కాదు...

***లోక్‌సత్తా రాజకీయ పార్టీగా సాగుతుందా? లేక స్వచ్ఛంద సంస్థగానా?***

*రాజకీయ పార్టీ స్వచ్ఛంద సంస్థే! దోపిడీ ముఠా కాదు. కాబట్టి లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ రూపంలోనే రాజకీయ పార్టీగా నడుస్తుంది.*

***మరి లోక్‌సత్తా-1, లోక్‌సత్తా-2 అనే పేర్లెందుకు? తేడా ఏంటి?***

*సాఫ్ట్‌వేర్‌లో 1.0, 2.0 అని కొత్త వెర్షన్లు వచ్చినట్టు... అవి కొన్ని మార్పులంతే! ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త రూపమంతే! అంతేగాని లక్ష్యాల్లో, ఉద్దేశాల్లో మార్పుల్లేవు. లోక్‌సత్తా నా కోసం కాదు. జాతి కోసం. సమాజం కచ్చితంగా ఎన్నటికైనా తమకు మంచి ఏమిటో అర్థం చేసుకుంటుంది. లోక్‌సత్తా మార్గంలో నడుస్తుంది. అప్పటిదాకా ప్రయోగాల్ని, ప్రయత్నాల్ని ఆపకుండా నడపాలంతే!*

***అంటే లోక్‌సత్తా విఫల ప్రయోగం కాదంటారు!***

*కచ్చితంగా కాదు. ప్రధానమంత్రి పదవికన్నా పౌరసత్వం గొప్పదని లోక్‌సత్తా ద్వారా నిరూపించాం. అసలు విజయాల్నే చూసినప్పుడు... ఈ దేశంలో ఏ ప్రధానమంత్రీ సాధించనవి సాధించాను. మూడు రాజ్యాంగ సవరణలు నా వల్ల సాధ్యమయ్యాయి.*

*ఏడెనిమిది పెద్దపెద్ద చట్టాలు జాతీయస్థాయిలో నా పట్టుదల వల్ల వచ్చాయి. చాలా ప్రభుత్వ విధానాల్లో మార్పులకు కారణమయ్యాను. నా పోరాటం వల్లే 2జీ స్పెక్ట్రమ్ లైసెన్సులు రద్దయి పోటీ బిడ్డింగ్ జరిగింది. ఆ రంగంలో అవినీతికి ఆస్కారం లేకుండా చేశాను. రుబెల్లా వ్యాక్సిన్ లక్షలమందికి చేరడానికి కారణమయ్యాను. ఇన్నింటిని ఎవరు సాధించారీ దేశంలో? ఊ... పదవులు రాలేదు. నిజానికి నేను పదవుల్ని కోరుకోలేదు కూడా! విజయం అంటే ఏమిటి? మార్పును సాధించటమా? పదవుల్లో ఉండి దండ వేయించుకోవటమా? దేశంలో మార్పుకోసమే ఉన్నత పదవిని వదులుకుని బయటికి వచ్చానుగదా! కానీ ఈ మార్పు సరిపోదు. కొండంత జరగాల్సి ఉంటే గోరంత జరిగింది. కచ్చితంగా దేశ పౌరుడిగా నాకా బాధ ఉంది. నేను చేస్తున్నదానితో సంతృప్తి చెందుతున్నాను. కానీ సాధించిన మార్పుతో మాత్రం కాదు. ఇంకా ఎక్కువ మార్పు కోరుకుంటున్నాను. ఇది నా సమస్య కాదు. మొత్తం జాతి సమస్య. ఇంతకంటే ఎక్కువ ఏం చేయాలో చెప్పండి చేస్తాను.*

**ఇంతకూ వచ్చే ఎన్నికల్లో లోక్‌సత్తా పోటీ చేస్తుందా?**

*పోటీ చేయటం, చేయకపోవటం నైతికమైన విషయం కాదు. ప్రాక్టికల్ విషయం. నా అంచనా ఏంటంటే... దేశంలో 10-15శాతం ఓట్లు మార్పు కోసం స్థిరంగా పడితే కచ్చితంగా అది వేదిక. ఆ కాలం, స్థలం వచ్చేదాకా మన శ్రమ వృధా అవుతుంది. కాబట్టి ప్రాక్టికల్‌గా పనిచేస్తుందా లేదా... ఫలితం వస్తుందా లేదా అని చూసుకోవాలి. ఫలితం వస్తుందంటే తప్పకుండా చేస్తాం! ఈ విషయంలో నేను స్పష్టంగా, నిర్దాక్షిణ్యంగా ఉంటాను. అందుకే నన్ను అరాచకవాది అనేవాళ్లూ ఉన్నారు. మార్గాలు లక్ష్యం కోసమే తప్ప... మార్పు కోసం లక్ష్యాన్ని తాకట్టు పెట్టకూడదు. పదవులకు కొరత లేదు. పదవుల కోసం లక్ష్యాన్ని తాకట్టు పెట్టకూడదన్నది నా సిద్ధాంతం!*

**ఆర్థిక స్వేచ్ఛ ప్రదాత పీవీ**

నిజానికి మనదేశ ఆర్థిక స్వేచ్ఛకు ప్రధాన కారకుడు పీవీ నరసింహారావు. ఆయన హయాం కచ్చితంగా మన జాతి నిర్మాణంలో కీలక ఘట్టం! సంక్షోభ సమయంలో... ఓ నిరుపేద సమాజంలో... సోషలిజం, సామ్యవాదాలకు పిచ్చి అర్థానిచ్చిన సమాజంలో... అసమానతలు, కులాలు మతాలున్న సమాజంలో... ఏ రకమైన అస్థిరత్వం లేకుండా ప్రజలందరిలోనూ ఏకాభిప్రాయాన్ని అలవోకగా నింపాదిగా... సాధించి ఇంత శాంతియుతంగా ఇంత పెద్దమార్పును తెచ్చే ప్రయత్నం ప్రపంచంలో ఎక్కడా జరగలేదు. పీవీ గొప్పతనం అది! నా పేరు కన్పించాలని తపించకుండా నా దేశం కోసం కొన్ని లక్ష్యాలు నెరవేరాలనే ఉద్దేశంతో నిరాడంబరంగా వెనకాల ఉంటూ సంయమనాన్ని పాటించి కీర్తిని వేరేవారికిచ్చి... సమాజంలో భయాందోళనలు లేకుండా చేసి... అద్భుతమైన చాతుర్యాన్ని, దూరదృష్టిని, దేశభక్తిని ప్రదర్శించారాయన! అలాంటి గొప్పవ్యక్తిని ఆయన పార్టీ కంటే ఇతర పార్టీలెక్కువగా గౌరవించాయి. ఆయనను స్వరాష్ట్రం కంటే దేశమంతా గౌరవించింది. దేశం కంటే ప్రపంచ ఆయన్ను ఎక్కువగా గుర్తించింది. కొంతమందికి ఆ దురదృష్టం ఉంటుంది. వాళ్లు చేసేపని చుట్టూ ఉన్నవాళ్లకంటే దూరంగా ఉన్నవాళ్లు గుర్తిస్తారు. దేశ చరిత్రలో ఆయన స్థానం చాలా కీలకమైంది. పదిలమైంది. స్వాతంత్ర్యం తొలినాళ్లలోనూ ఇలాంటి నాయకులు లేరని కాదు. కానీ వారి మాట చెల్లలేదు. వారందరినీ పక్కనబెట్టారు.

**ఎన్నికలకు మీరు ఇక గుడ్‌బై చెప్పినట్లేనా?**

ఎన్నికల ద్వారా మార్పు వస్తుందనే నమ్మకంతోనే ఎన్నో కష్టనిష్ఠూరాలకు ఓర్చి రాజకీయ పార్టీ పెట్టాం! కానీ ఆ మార్పునకు ఇంకా సమయం పట్టేలా ఉంది. దేశంలోని నగర ప్రాంతాల్లో ముఖ్యంగా మహానగరాల్లో కొన్నిచోట్ల తప్ప మిగిలిన చోట్ల ప్రజల్లో మార్పు కోసం ఓటు వేసే పరిస్థితి కనిపించటం లేదు. ఢిల్లీ మహానగరమే ఓ రాష్ట్రం. కాబట్టి కొంత మార్పు వచ్చింది. కానీ మన హైదరాబాద్, విజయవాడ, చెన్నై... ఇలాంటివి పేరుకే నగరాలు. ఇక్కడ మార్పు అంత సులభంగా వచ్చేలా కన్పించటం లేదు. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు... రకరకాల ప్రలోభాలకు లోనవుతున్నారు. కాబట్టి ఈ ప్రజాస్వామ్యంలో ఆలోచించి అనుకున్నదానికి ఓటేయటానికి కాస్త సమయం పడుతుంది. కాబట్టి ఎప్పుడైతే ఈ గతుకుల రోడ్డుపై ఈ వాహనం పనికి రావటం లేదో మరో మార్గాన్ని, వాహనాన్ని ఎంచుకుంటాం. లక్ష్యం మారటం లేదనే సంగతి గుర్తించాలి. ఎలాగోలా అధికారంలోకి వచ్చి మార్పు

### మానసికంగా ఇంకా బానిసలమే

స్వాతంత్య్రం వచ్చినా మానసిక బానిసత్వం ఇంకా మనలో కొనసాగుతోంది. నేను ఆంగ్లానికి వ్యతిరేకమేమీ కాదు. ప్రజలకు తెలిసిన భాషలో పరిపాలన సాగకుంటే అది సరైన పాలనే కాదని నమ్ముతాను. స్వాతంత్య్రం వచ్చాక మన భాషల్ని ఆధునిక అవసరాలకు తగ్గట్టు విస్తరించుకోలేదు. పాఠశాల విద్యలో తల్లిదండ్రులు పిల్లలతో ఏ భాషలో మాట్లాడతారో ఆ భాషలోనే పాఠశాల విద్య నేర్పాలి. కానీ ఇప్పుడు ఇంగ్లిష్ తెలియని ఉపాధ్యాయులు... ఇంగ్లిష్ తెలియని పిల్లలకు ఇంగ్లిష్‌లో పాఠాలు చెబుతున్నారు. తెలుగు మాధ్యమంలో పాఠాలు బాగా చెప్పుకొని... ఇంగ్లిష్ కూడా నేర్పుతారని నమ్మకాన్ని మన బడుల్లో ఇవ్వగలిగితే పిల్లలు తెలుగు మాధ్యమంలోనే చదువుతారు. కానీ ఆ పని చేయలేకపోతున్నాం. మన బిడ్డల్లోని తెలివితేటల్ని వికసింపజేయలేకపోతున్నాం. అందుకే ముందు బడుల్లో విద్యాప్రమాణాలు పెంచి మాధ్యమం గురించి మాట్లాడితే మేలు. అర్థంగాని చదువులు ఎన్ని చదివినా ఏం లాభం? ఆంగ్లమా? తెలుగా? అని కాకుండా వారికి అర్థమయ్యే భాషలో, అర్థమయ్యే రీతిలో బోధించటం ప్రధానం.

### అదే మన బలం...

**కుటుంబ వ్యవస్థ మన బలం. అదే సమాజంలో శాంతిని కాపాడుతోంది. కులమతాలకు అతీతంగా ఉందిది. దీనివల్ల మనదేశంలో ఎవరైనా కూడా ఓ గీత దాటి తప్పు చేయరు. అమెరికాలో జనాభా ఎంతుందో అన్ని తుపాకులున్నాయి. భయంభయంగా బతకాల్సిందే అక్కడ. మనకా పరిస్థితి లేదు. బలాన్ని పెంచి, బలహీనతల్ని తగ్గించటం మంచి నాయకత్వం చేయాల్సింది. ఆ పని నాయకత్వం ఇన్నాళ్లలో చేయలేదు.**

### నా తప్పు మీరు చేయకండి

నాదీ సాధారణ కుటుంబమే. నాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి విదేశాల్లో చదువుకుని ఇక్కడే తన కాళ్లపై తాను నిలబడే ప్రయత్నం చేస్తున్నాడు. అమ్మాయి గాంధీ కాలేజీలో ఎంబీబీఎస్ చివరి సంవత్సరం చదువుతోంది. మా కుటుంబంలోనూ మల్లగుల్లాలుంటాయి. నా జీవితంలో ఏదైనా తప్పు చేసి ఉంటే అది నా కుటుంబానికి సమయం కేటాయించకపోవటం. ఆ తప్పు చేయొద్దని అందరికీ చెబుతుంటాను. ఎందుకంటే నేను పనిలో పడి కుటుంబాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. దానివల్ల ఇబ్బందులుంటాయి. ఇప్పుడు ఎంతోకొంత సవరించే ప్రయత్నం చేస్తున్నాను.

◆ శాకాహారం ఇష్టం. మాంసాహారం మానేయాలన్నా కుదరటం లేదు. పరిమితంగా తింటాను. బీరకాయ పప్పు చాలా ఇష్టం.

◆ పుస్తకాలు విపరీతంగా చదువుతాను. గతంలో రెండ్రోజులకో పుస్తకం చదివేసేవాణ్ని. కాల్పనిక సాహిత్యం కూడా! కానీ ఇప్పుడది లేదు. చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆంత్రోపాలజీ... చదువుతాను.

◆ బెర్ట్రండ్ రసెల్ రచనలు నాపై ఎక్కువ ప్రభావం చూపించాయి. తార్కికంగా ఆలోచించేలా నాపై ముద్ర వేశారాయన. తర్వాత గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీల ప్రభావమూ ఉంది. గాంధీ నా దృష్టిలో మహోన్నతుడు. నూటికి నూరుపాళ్లూ కల్మషం, మాలిన్యం లేని వ్యక్తి ఆయన. ఆయన రచనలు కొన్ని చదువుతుంటే ఇప్పటికీ కళ్లు చెమరుస్తుంటాయి. మనం అనుకున్న స్వాతంత్య్రం, దేశం రావటం లేదని ముందే గుర్తించిన వాడాయన. అలాగే దేశాన్ని సంఘటితం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్, దార్శనికుడు రాజగోపాలాచారి కూడా నాకిష్టం.

సాధించడానికి నేను సిద్ధంగా లేను. ధర్మాన్ని అతిక్రమించను!

**ఇదే ఎన్నికల ప్రక్రియలో మీరూ గెలిచారు కదా!**

కూకట్‌పల్లి, ఢిల్లీ, ముంబయిలాంటి కొన్నిచోట్ల మనం ఆశిస్తున్న మార్పు మిణుకుల్లా కనిపిస్తుంది. అలాంటి పరిస్థితులు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా లేవు. ఎవరో ఒకరు ఒకచోట గెలిస్తే చాలదు. ప్రజల్లో వివేకం పెరిగితేనే భవిష్యత్ బాగుపడుతుంది. ఓటు వేసేది ఎన్నికల్లో నిలబడ్డవారికి కాదు... తన భవిష్యత్‌కు వేస్తున్నాననే స్పృహ ప్రతి ఒక్కరిలోనూ రావాలి.

**ప్రజలింకా మార్పునకు సిద్ధంగా లేరంటారా?**

ప్రజలు మారటానికి సిద్ధంగాలేరని నేననటం లేదు. సంక్లిష్టమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పులకు దశాబ్దాలు, శతాబ్దాలు పడుతాయి. కాకుంటే వాటిని వేగవంతం చేయటానికి

**దేవుడు నన్ను పట్టించుకోకుంటే నేనూ దేవుణ్ణి పట్టించుకోను. ఎవరైనా రమ్మంటే గుడికి వెళతాను. వెళ్లాలని లేదు. వెళ్లకూడదని లేదు. దేవుడున్నాడో లేదో తెలియదుగానీ మనిషైతే ఉన్నాడు.**

### ఉద్యోగుల్లోని ఐక్యత ప్రజల్లో రావాలి

*ప్రజలు ఎదురుతిరుగుతారనే భయం కంటే... ఉద్యోగులు ఉమ్మడిగా ఎదురుతిరుగుతారనే భయం ప్రభుత్వాల్లో, పార్టీల్లో ఎక్కువై పోయింది. ప్రజలు కూడా తిరుగుబాటు చేస్తారనే భయం కల్పించటమే దీనికున్న ఏకైక పరిష్కారం. అటు పార్టీలుగానీ, ఇటు ఉద్యోగులుగానీ ప్రజలకు సేవ చేయటానికున్నారే తప్ప మరెందుకూ కాదు. ఉద్యోగుల కిస్తున్న జీతభత్యాలు ప్రజల కష్టార్జితం! అలాంటప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనుల్ని ఎందుకని చేయరు? నీటి కనెక్షన్ కావాలన్నా... పట్టాదారు పాసుపుస్తకం కావాలన్నా లంచం ఇవ్వాల్సిన అవసరం ఏంటి? జీతం తీసుకుంటున్నపుడు పనెందుకు చేయరని నిలదీసే ధైర్యం, చైతన్యం ప్రజల్లో రావాలి. ఇలాంటి చైతన్యం ప్రజల్లో వస్తే, సంఘటితమైతే ప్రభుత్వం, పార్టీలు ప్రజలకు భయపడటం మొదలెడతాయి. ఉద్యోగులూ జవాబుదారీతనంతో పనిచేస్తారు. ఉద్యోగులంతా చెడ్డవాళ్లేమీ కారు. ప్రజల్లో చైతన్యం వస్తే వారిలోని మంచితనం పనుల్ని వేగవంతం చేస్తుంది. మనదేశంలో సామాన్య ప్రభుత్వ ఉద్యోగి చాలామంది కంటే ఎంతో సంపన్నుడు.*

మనం కృషి చేయాలి. అందుకే ప్రజాస్వామ్య సంస్కరణల గురించి నేను మొదట్నుంచీ మాట్లాడుతున్నాను. 'నిర్ణయాధికారం నాకుంది... నా ఓటు వల్ల నా బతుకు బాగుపడుతుంది. లేదంటే చెడిపోతుం'దనే స్పృహ ప్రజల్లో కలిగితే దేశం బాగుపడుతుంది. కానీ అలాంటి పరిస్థితిని దేశంలో మనం కల్పించలేదు. ప్రజల తప్పు కాదిది. రాజకీయ నాయకులది! నిజానికి స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్య పాఠశాలలు. వాటినే నిర్వీర్యం చేసి ప్రజల్ని ప్రజాస్వామ్యంలో మనం పీహెచ్‌డీ చేయమంటున్నాం. మన పిల్లల్ని స్కూలుకు పంపించకుండా పీహెచ్‌డీ చేయమంటే చేస్తారా? ఇదీ అలాంటిదే! ఎన్నికైనవారు కావచ్చు, ఎన్నిక కానివారు కావచ్చు... దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తి ఉన్న నాయకులమంతా కూడా విఫలమయ్యాం. 70 ఏళ్లలో మనదేశ రాజకీయ వ్యవస్థ



విఫలమైంది. అది గుర్తించకుంటే ఆత్మవంచన చేసుకున్నట్టే!

ప్రజాస్వామ్యంలేని చైనాతో మనల్ని పోల్చుకొని చూడటం సబబేనా?

చైనాను అందుకునేంత సామర్థ్యం, శక్తి మనకు నిగూఢంగా ఉన్నాయి. కానీ చైనా ముందుచూపుతో చేసుకున్న మౌలిక సదుపాయాలు మనం చేసుకోలేదు. అక్కడ నియంతృత్వమున్నా బలమైన స్థానిక ప్రభుత్వాలున్నాయి. ఈ విషయం చాలామందికి తెలియదు. ఈ విషయంలో చైనాలో ఉన్నంత ప్రజాస్వామ్యం మనదేశంలో లేదు. మన దగ్గరున్న ఓటు హక్కును, అరిచే స్వేచ్ఛను చూసి అదే ప్రజాస్వామ్యమనుకుంటే ఎలా? నా ఊర్లో నిర్ణయాలు నేను తీసుకోగలగటం అసలైన ప్రజాస్వామ్యం. చైనాలోని ఏదైనా పట్టణానికి వెళ్లి మనం పెట్టుబడి పెట్టాలంటే అక్కడి అధ్యక్షుడు, ప్రధాని, ఆ రాష్ట్ర నేతలను కలవాల్సిన పన్లేదు. ఆ పట్టణ అధికారులు, నేతలను కలిస్తే పనైపోతుంది. అదే మన విజయవాడో, హైదరాబాదో, కరీంనగర్లోనో... ఎవరైనా పెట్టుబడి పెట్టడానికి వచ్చి అక్కడి మేయర్‌తో చర్చించే పరిస్థితి మనం ఊహించగలమా? మరి మనం ప్రజాస్వామికమా? చైనానా? ఇక చదువుల విషయానికొస్తే... 8వ తరగతి దాకా ప్రపంచంలో అత్యున్నత

### ఆ రెండింటినీ బాగు చేస్తేనే..
### అభివృద్ధి చెందటానికి 70 సంవత్సరాల స్వాతంత్ర్యం సరిపోదా?

*100 సంవత్సరాల కిందైతే అభివృద్ధికి 70 ఏళ్లు సరిపోయేవి కావనే అనేవాడిని. ఇప్పుడు మాత్రం అలా కాదు. అభివృద్ధికి మనకున్న వనరులు సరిపోతాయి. మన తర్వాత స్వాతంత్ర్యం సంపాదించుకున్న దేశాలు చైనా, కొరియా, సింగపూర్, మలేషియా, తైవాన్... చివరకు ఇండోనేషియాలాంటివీ శరవేగంగా అభివృద్ధి చెందాయి. ఆధునిక యుగంలో మనకూ టెక్నాలజీ, వనరులు గతంలో ఎన్నడూ లేనంతగా ఉన్నాయి. ఈ మధ్య 49దేశాలపై (అన్నీ 200 బిలియన్ డాలర్లకంటే ఎక్కువ జాతీయోత్పత్తి ఉన్న పెద్దదేశాలే) అధ్యయనం చేస్తే... మన భారతదేశం దాదాపు ప్రతి రంగంలోనూ చివరి 4 స్థానాల్లో ఉంది. మన సరసన ఉన్న దేశాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నైజీరియాలు! అదేనా మనం కోరుకునేది? అంతకంటే ఎంతో ఘనత సాధించే అవకాశం మన దేశానికుంది. గొప్ప వనరులు, సంస్కృతి, సాహిత్యం చరిత్ర, నాయకులు, అన్నింటికంటే ముఖ్యంగా బలమైన కుటుంబ వ్యవస్థ, మతతత్వంలేని ప్రభుత్వం... ఉగ్రవాదాన్ని ప్రోత్సహించని సమాజం... ఇవన్నీ మన బలం! ఇన్ని ఉండి కూడా ఎదగలేకపోయామెందుకు? చైనా 30 సంవత్సరాల్లోనే ప్రపంచంలో ఎవ్వరూ పోటీపడనంతగా అభివృద్ధి సాధించింది. అందుకే... ఈ 70 ఏళ్లలో కచ్చితంగా మనం బాగా ఎదగగలిగేవాళ్లమే. కానీ మన విధానాల్లో తప్పిదాలు, ప్రజాస్వామ్య నిర్మాణంలో తప్పిదాల వల్ల తీవ్రంగా నష్టపోయాం, ఇంకా నష్టపోతున్నాం.*

*ఎలాంటి తప్పిదాలు?*

*మూడు దశల్లో దెబ్బతిన్నాం. మన ప్రభుత్వ వ్యవస్థ నిర్మాణంలోనే లోపాలున్నాయి. రాజ్యాంగ నిర్మాణమప్పుడే బలమైన స్థానిక ప్రభుత్వాలు, నిజమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పాటు చేసి ఏ రాష్ట్రానికా రాష్ట్రం స్వయంపాలనకు అవకాశం ఇవ్వాల్సింది. ఇక్కడ స్వయంపాలనంటే దేశం నుంచి వేరవటమని కాదు. దేశ ఐక్యతకు, ప్రాథమిక హక్కులకు లోబడే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీలలో మాదిరిగా రాష్ట్రాలు తమనుతాము పరిపాలించుకునే ఏర్పాట్లు కల్పించాల్సింది. విద్య, వైద్యానికి పెద్దపీట వేయాల్సింది. ఈ విషయాల్లో రాజ్యాంగ నిర్మాణంలోనే విఫలమయ్యాం. గొప్ప నాయకులు, గొప్ప ఆశయాలతో రాజ్యాంగాన్ని రచించారు. కానీ నిరుపేదలు, కులవ్యవస్థ, అసమానతలు ఉన్న సమాజంలో ప్రజాస్వామ్య నిర్మాణం కేవలం ఓటుతో రాదు... దానికి ప్రజల్ని సమాయత్తం చేయాలంటే ఈ వ్యవస్థల్ని నిర్మించాలనే సంగతి విస్మరించారు.*

*ఇక రెండో దశ తప్పిదాలు నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో జరిగాయి. సోషలిజాన్ని అపార్థం చేసుకొన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాల్ని ప్రజలకు కల్పించటం అసలైన సోషలిజం. కానీ మన దగ్గర వాటిని పక్కనబెట్టి ప్రభుత్వ నియంత్రణకు పెద్దపీట వేశారు. మీరు తుమ్మాలన్నా, దగ్గాలన్నా ప్రభుత్వ అనుమతి కావాలి. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నట్టు ప్రతిదాంట్లో ప్రభుత్వ పెత్తనం ఎక్కువైంది. దీంతో ఉద్యోగుల్లో అవినీతి, ప్రజలు ప్రతిదానికీ ప్రభుత్వంపై ఆధారపడాల్సిన పరిస్థితి, వాటిని చూడటానికి అధికార యంత్రాంగం.. అవినీతి... ఇలా ఓ విషవలయం తయారైంది. ఆర్థిక స్వేచ్ఛ ఎప్పుడైతే లేకుండా పోయిందో... ఉత్పత్తి చేసే శక్తి ఉన్నా, తపన ఉన్నా అవన్నీ వృథా అయ్యాయి. కాబట్టి దేశం ఆర్థికంగా ఎదగలేకపోయింది.*

*ఇప్పుడు మూడో దశలోనూ తప్పు చేస్తున్నాం. ప్రపంచాన్ని చూశాం... మన పాత తప్పులూ చూసుకున్నాం. అన్నీ చూసీ... కూడా అలాగే చేస్తున్నాం. ప్రపంచాన్ని అందుకోవాలంటే స్థానిక సంస్థలను, పాలనను బలోపేతం చేసి... విద్య, వైద్యాలను బాగు చేయొచ్చుగదా! మరెందుకు చేయటం లేదు? తప్పులు జరిగాయి... జరుగుతున్నాయి కూడా!*

ప్రమాణాలతో కూడిన విద్య నయాపైసా ఖర్చు లేకుండా తమ దేశంలోని ప్రతి బిడ్డకూ అందే ఏర్పాట్లను చైనా ప్రభుత్వం చేసింది! అదీపిల్లలకు అర్థమైన భాషలో! ఇది నా కళ్లతో చూశా. వైద్యం కూడా బాగుంది. అందుకే దేశంలోని కోట్లమంది ఉత్పత్తిలో పాలుపంచుకుంటున్నారు. మనదేశంలోనైనా ప్రతి ఒక్కరూ దేశ ఉత్పత్తిలో భాగస్వాములు కావాలంటే ఈ మౌలిక సదుపాయాలే కల్పించాలి. మావో పిడివాదం వల్ల లక్షల మంది చైనాలో దెబ్బతిన్నారు. కానీ తర్వాత మారి తమ తలరాత మార్చుకున్నారు. ఓటు, భావస్వేచ్ఛ విషయం తప్పిస్తే... చైనా చాలా విషయాల్లో మనకంటే మెరుగ్గానే, ప్రజాస్వామ్యయుతంగానే ఉంది.

– రేగళ్ల సంతోష్ కుమార్ ★

# విలువలకు పాతర .. వివాదాల జాతర

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్



**చట్టసభ సభ్యులు లాభదాయకమైన పదవుల్లో కొనసాగడంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. నిజానికి ఇదో సాంకేతిక సమస్య. దీన్ని భూతద్దంలో చూపించి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్న నేతలు– కీలకమైన ప్రజాసమస్యలను గాలికి వదిలేస్తున్నారు.**

చట్టసభ సభ్యులు లాభదాయకమైన పదవులు చేపట్టరాదన్న నిషేధం, నేతల చేతిలో రాజకీయ సాధనంగా మారింది. సాంకేతికమైన ఈ సమస్యను గోరంతలు కొండంతలు చేసి, రాజ్యాంగపరమైన, నైతికపరమైన అంశంగా చిత్రీకరిస్తున్నారు. జోడు పదవుల వివాదంపై జోరుగా సాగుతున్న చర్చలు, వాదోపవాదాలు అన్నీ రాజకీయ లబ్ధి కోసమే తప్ప, ప్రజాప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. తాజా వివాదంలో ప్రధాన రాజకీయ పక్షాల దివాలాకోరుతనాన్ని అర్థం చేసుకోవాలంటే, ఇప్పటివరకూ జరిగిన సంఘటనలను ఓసారి సమీక్షించుకోవడం అవసరం. రాజ్యసభ నుంచి జయాబచ్చన్‌కు ఉద్వాసన పలికేందుకు రాజ్యాంగంలోనూ, చట్టాల్లోనూ ఉన్న అస్పష్టమైన నిబంధనలను ఆసరాగా చేసుకొని కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు అనవసరంగా జోడు పదవుల వివాదాన్ని రెచ్చగొట్టారు. జయాబచ్చన్ పదవి పోవడంతో– పగలు, ప్రతీకారాలు తీర్చుకొనేందుకు ఈ వివాదం రాజకీయ పార్టీలకు ఒక సాధనంగా మారింది. తమ చాప కిందకు నీరు వస్తున్న విషయాన్ని విస్మరించి, అవి ఎదుటివారిలో లోపాలను ఎంచసాగాయి. ఈ వివాదంపై సరైన రీతిలో, బాధ్యతాయుతంగా స్పందించడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రతిపక్షాలు రెట్టించిన ఉత్సాహంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీపై తమ అస్త్రాలను ఎక్కుపెట్టాయి. సోనియా గాంధీ జోడు పదవుల్లో కొనసాగడం రాజ్యాంగంలోని 102వ అధికరణ కింద అనర్హతకు దారితీస్తుందని విపక్షాలు వాదించడంతో ప్రభుత్వం కంగుతింది. అన్ని పార్టీలతో సంప్రదించి సమస్యకు సరైన పరిష్కార మార్గాన్ని కనుగొనవలసిన ప్రభుత్వం కుట్రపూరితమైన విధానాలను అవలంబించింది. జోడు పదవుల నిర్వహణకు సంబంధించి ఆర్డినెన్సును తీసుకురావాలన్న ప్రభుత్వ యోచనకు సోనియా అంగీకరించలేదు. లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేసి, తిరిగి పోటీ చేయాలని నిర్ణయించుకొన్నారు. అయితే తన పదవికి సోనియా రాజీనామా చేయడాన్ని నిరుపమానమైన త్యాగంగా ఎవరూ అభివర్ణించాల్సిన అవసరం లేదు. వాస్తవానికి సోనియా వైదొలగినా, లాభదాయకమైన పదవుల వివాదం పార్టీలను వెన్నాడుతూనే ఉంది. ఈ విషయంలో ఏకాభిప్రాయ సాధన ద్వారా సంబంధిత చట్టాలను సవరించేందుకు ప్రభుత్వం వచ్చే నెలలో పార్లమెంటును సమావేశపరచబోతోంది. ఒక ప్రహసనంలా సాగిన ఈ మొత్తం ఉదంతంలో ప్రజలకు ఉపయోగపడే అంశం ఒక్కటైనా లేదు.

**అధికారాల విభజనకు వీలు ఏదీ?**

మనదేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది చట్టసభలే. ఇలాంటి వ్యవస్థలో అధికారాల విభజన అనే ఆలోచనే హాస్యాస్పదమైనది. ప్రస్తుత వ్యవస్థలో ప్రభుత్వం పరోక్ష పద్ధతిలో ఎన్నికవుతుంది. దిగువ సభ (లోక్‌సభ) విశ్వాసాన్ని చూరగొన్నంత వరకే అది అధికారంలో కొనసాగుతుంది. చట్టసభ సభ్యుడైన వ్యక్తి మాత్రమే మంత్రివర్గంలో కొనసాగేందుకు అర్హుడు. చట్టసభ సభ్యులు కాని వారెవరైనా మంత్రి పదవిని చేపట్టినా, ఆరునెలల్లోగా విధిగా చట్టసభకు ఎన్నిక కావాలి. లేని పక్షంలో వారి మంత్రి పదవి రద్దవుతుంది. వాస్తవానికి శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు రెండూ వేర్వేరుగా ఉండాలి. ఈ రెండింటిలోనూ ఒకే వ్యక్తి ఏకకాలంలో పదవులు కలిగి ఉండకూడదు. అధికారాల విభజనకు అసలైన అర్థం అదే. కానీ ప్రస్తుత వ్యవస్థ అందుకు పూర్తి భిన్నంగా ఉంది. చట్టసభ సభ్యులే మంత్రి పదవుల్లో కొనసాగాలని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. కానీ చట్టసభ సభ్యుడు మంత్రి కావడానికి

వీల్లేదని అమెరికా రాజ్యాంగం శాసిస్తోంది. ఈ నేపథ్యంలో- లాభదాయకమైన పదవుల నిర్వహణ అనేది కేవలం సాంకేతికపరమైన అంశం మాత్రమేనని స్పష్టంగా అర్థమవుతోంది. కానీ చిన్నపాటి ఈ వివాదాన్ని భూతద్దంలో చూపేందుకు రాజకీయ పక్షాలు, మీడియా తాపత్రయపడుతున్నాయి. ఒక నైతిక సూత్రానికి, సాంకేతికపరమైన అంశానికీ మధ్యనున్న తేడాను ఎవరూ పట్టించుకోవడం లేదు. రాజ్యాంగంలోని 102వ అధికరణం కింద అనేక పదవులను లాభదాయకమైన జాబితా నుంచి మినహాయిస్తూ ప్రభుత్వం 1959లో పార్లమెంటు సభ్యుల (అనర్హత నిరోధక) చట్టాన్ని తీసుకువచ్చింది. కేంద్రాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వాలు కూడా 191వ అధికరణ కింద వందలాది పదవులను అనర్హత వేటు పడకుండా తప్పిస్తూ చట్టాలు చేసుకున్నాయి. ప్రభుత్వాలు ఈ చట్టాలకు తాజాగా ఏవైనా సవరణలు చేస్తే, మినహాయింపు లభించిన జాబితాలోకి మరికొన్ని పదవులు వచ్చి చేరుతాయంతే. మరో విధంగా చెప్పాలంటే- ప్రస్తుతం పార్లమెంటు సభ్యులు నిర్వహిస్తున్న లాభదాయకమైన పదవులన్నింటికీ మినహాయింపు కల్పిస్తూ చట్టం చేస్తారన్నమాట. రాజ్యాంగంలోని 102, 191 అధికరణలను పునస్సమీక్షించని పక్షంలో- వివక్షాపూరితమైన ఇటువంటి చట్టాలు చలామణి అవుతూనే ఉంటాయి.

రాజ్యాంగంలో పదో షెడ్యూల్‌ను పొందుపరిచాక, చట్టసభ సభ్యుల స్వేచ్ఛ మిథ్యగా మారింది. ఈ షెడ్యూల్‌లో పేర్కొన్న నిబంధనల ప్రకారం, సభ్యులంతా తమతమ పార్టీలు జారీ చేసే విప్‌లకు లోబడి సభలో ఓటుహక్కును వినియోగించుకోవలసి ఉంటుంది. శాసనకర్తలెవరైనా ప్రభుత్వ అభీష్టం మేరకే లాభదాయకమైన పదవుల్లో కొనసాగుతారు. ఈ నేపథ్యంలో లాభదాయకమైన పదవుల్లో ఉన్నవారికి ఏదో ఒరుగుతుందనుకోవడం అనవసరం. ప్రభుత్వాల మనుగడను ప్రభావితం చేయని అంశాలపైనా తమ ఇష్టానుసారం ఓటు వేసే స్వేచ్ఛ సభ్యులకు లేనప్పుడు, కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి శాసన వ్యవస్థను వేరుచేయాలనడం అసంబద్ధం.

నియోజకవర్గాల్లో ప్రజోపయోగకరమైన పనులు చేపట్టే నిమిత్తం పార్లమెంటు సభ్యులకు, శాసనసభ్యులకు కేటాయించే నిధుల వినియోగంలో అనేక అవకతవకలు జరుగుతున్నాయి. అయినా ఎంపీలాడ్స్, ఎమ్మెల్యేలాడ్స్ పథకాలు నిక్షేపంగా కొనసాగుతూనే ఉన్నాయి. పైగా, పనులు చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వ నిధులు తమ వద్ద ఉండడం అవసరమని కొందరు శాసనకర్తలు వాదిస్తున్నారు. అధికారాల విభజన పేరిట- నిధులను శాసనకర్తల అధీనంలో ఉంచడం కంటే అవివేకమైన పని మరొకటి ఉంటుందా? తమ డిమాండ్‌కు ప్రభుత్వం సమ్మతించినా, నిధుల నిర్వహణపై నియంత్రణాధికారాలు జిల్లా కలెక్టర్‌కే తప్ప, అవి తమ చేతిలో ఉండవని మరికొందరు సభ్యులు వివరణ ఇస్తున్నారు. ఆ మాటకొస్తే- ప్రధానమంత్రికిగాని, లేదా ఏ ఇతర మంత్రివర్గ సభ్యుడికిగాని ప్రభుత్వ నిధుల్ని నేరుగా వ్యయం చేసే అధికారం ఉండదు. ట్రెజరీ అధికారులు మినహా కలెక్టర్లు, ఇతర అధికారులకు సైతం ఆ వెసులుబాటు ఉండదు. నిధుల నిర్వహణ బాధ్యతలు ఎవరి చేతిలో ఉన్నాయన్నది కాదు, నిధుల వ్యయానికి సంబంధించి నిర్ణయాలు ఎవరు తీసుకుంటున్నారన్నదే కీలకం.

స్వార్థ ప్రయోజనాల కోసం నేతలు ఆడే రాజకీయ పాచికలాటలో లాభదాయకమైన పదవుల వివాదం ఓ పావుగా మారిందన్నది నిర్వివాదాంశం. ఎత్తులకు పైయెత్తులు వేయడం, అర్థరహితమైన వివాదాలను రెచ్చగొట్టడం నాయకుల దైనందిన రాజకీయ జీవితంలో భాగంగా మారడంతో, ప్రజలకు సంబంధించిన అనేక కీలక సమస్యలు మరుగున పడుతున్నాయి. ఈ సందర్భంలో బ్రిటన్‌లో రాజకీయ సరళిని, అక్కడి తాజా పరిణామాలను ఓసారి పరిశీలించడం అవసరం. బ్రిటన్ ప్రధాని టోనీ బ్లెయిర్ రాజకీయ భవితవ్యంపై ప్రస్తుతం ఆ దేశంలో వాడిగా, వేడిగా చర్చ సాగుతోంది. బ్లెయిర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ వరుసగా మూడోసారి ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది. లేబర్ పార్టీ నాయకుల్లో హెరాల్డ్ విల్సన్ తరవాత ఆ ఘనత సాధించింది బ్లెయిర్ ఒక్కరే. పాఠశాల విద్యలో నాణ్యతను, జవాబుదారీతనాన్ని పెంచేందుకు వీలు కల్పిస్తూ బ్లెయిర్ ప్రభుత్వం ఇటీవల సంస్కరణలను ప్రతిపాదించింది. లేబర్ పార్టీలోని అనేకమంది ఎం.పిలు ఈ సంస్కరణలతో సిద్ధాంతపరంగా విభేదిస్తున్నారు. ఆ పార్టీకి చెందిన 52 మంది ఎం.పిలు బ్లెయిర్ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు వేశారు. విపక్షంలో ఉన్న కన్సర్వేటివ్ పార్టీ సభ్యులు మద్దతు పలకడంతో సంస్కరణలకు ఆమోదముద్ర పడింది. అయితే, స్వపక్షానికి చెందిన సభ్యుల సంపూర్ణ మద్దతును పొందలేకపోవడంతో, బ్లెయిర్ నాయకత్వంపై ఇప్పుడు నీలినీడలు కమ్ముకున్నాయి. రాజకీయ ప్రమాణాల విషయంలో మనదేశానికి, బ్రిటన్‌కు మధ్యగల వ్యత్యాసానికి ఈ సంఘటన ఓ నిదర్శనం. సంస్కరణలకు మోకాలడ్డిన అధికార పక్షం ఎం.పిలు అసమ్మతివాదులు కారు. ప్రభుత్వాన్ని కూల్చివేయాలన్న ఆలోచన వారికి అంతకంటే లేదు. బ్లెయిర్ విధానాలు నచ్చకపోవడం వల్లనే వారు సంస్కరణలను వ్యతిరేకించారు. దీనిని ఆసరాగా తీసుకుని అధికార పక్షంలో ఫిరాయింపులను ప్రోత్సహించేందుకు ప్రతిపక్షంలో ఉన్న కన్సర్వేటివ్ పార్టీ

ఏమాత్రం ప్రయత్నించకపోవడం విశేషం. బ్లెయిర్ విధానాలు సరైనవేనని ఆ పార్టీ ఎం.పిలు భావించారు. ఆ మేరకు పార్లమెంటులో సంస్కరణలకు అనుకూలంగా ఓటు వేశారు. ఆ విధంగా పాఠశాల సంస్కరణల అంశంలో అందరూ ప్రజాప్రయోజనాలకే పట్టం గట్టారు. సిసలైన రాజకీయాలకు ఇంతకంటే సరైన నిర్వచనం ఇంకేం కావాలి?

**ప్రజాసమస్యలు గాలికి**

మనదేశంలో పాఠశాల విద్య పతనావస్థకు చేరింది. ప్రజారోగ్య వ్యవస్థ నాగరిక సమాజాన్ని అవహేళన చేసే స్థాయికి దిగజారింది. న్యాయవ్యవస్థ సైతం సంక్షోభంలో చిక్కుకుంది. పర్యావరణ కాలుష్యం పెచ్చుమీరుతోంది. జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో మావోయిస్టులు విధ్వంసం సృష్టిస్తున్నారు. ఇవన్నీ దేశం ఎదుర్కొంటున్న కీలక సమస్యలే. వీటిపై తక్షణం దృష్టి సారించవలసిన అవసరం ఉంది. కానీ మన చట్టసభలు నిష్ప్రయోజనమైన చర్చలతోను, వృథా రాజకీయాలతోనూ పొద్దుపుచ్చుతున్నాయి. రాజకీయాల్లో స్వచ్ఛతకు, పారదర్శకతకు పెద్దపీట వేయాలి. అవినీతిరహిత ప్రభుత్వాలే పాలన పగ్గాలను చేపట్టాలి. అవి అర్థవంతమైన, ప్రజోపయోగకరమైన విధానాలకు రూపకల్పన చేయాలి. ప్రజల సమస్యలు తీరేదీ, వారి జీవనవిధానం మెరుగయ్యేదీ అప్పుడే.

(ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలపై అనర్హత వేటు నిర్ణయంతో లాభదాయక పదవుల వివాదం మళ్లీ రాజుకుంది. ఈ అంశంపై స్పష్టత కోసం..

జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 3, 2006న ఈనాడులో ప్రచురితమైన ఈ వ్యాసాన్ని అందిస్తున్నాం). ★

# చంద్రబాబు ప్రభుత్వ చేతగానితనం.. మోదీ సర్కారు లెక్కలేనితనం

## –రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపుల తీరుపై లోక్‌సత్తా నిరసన–





ఆంధ్రప్రదేశ్ సమస్యల పట్ల కేంద్రప్రభుత్వం బెల్లం కొట్టిన రాయిలా వ్యవహరిస్తోందని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాల సుబ్రహ్మణ్యం అన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులు దారుణంగా ఉన్నాయని, విభజన చట్టంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు నిధుల్ని ఏ రూపంలో ఇస్తారో చెప్పటానికి కూడా కేంద్రం ముందుకు రావటం లేదని అన్నారు. అయినా మంత్రులు, ఎంపీలు పదవుల్ని పట్టుకుని వేలాడుతున్నారన్నారు. మోదీ ప్రభుత్వ తీరుకు నిరసనగా తిరుపతిలోని గాంధీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద నిరసన వ్యక్తం చేశారు.

రాష్ట్రం పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు బీజేపీ మూల్యం చెల్లించక తప్పదని బాలసుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బీజేపీ తీరుకు తగ్గట్టే ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా వ్యవహరిస్తున్నారన్నారు. తెలుగునాట పాలకులు, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా ఉండి ఉంటే కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆటలు సాగేవి కావన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని తెదేపా, వైసీపీ ఢిల్లీలో తాకట్టుపెట్టాయన్నారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఒంటెద్దు పోకడలను వీడి.. అన్ని పార్టీలు, పౌరసమాజంతో చర్చించి కేంద్రం నుంచి నిధుల్ని రాబట్టేందుకు చంద్రబాబు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, రాఘవరెడ్డి, హేమాద్రి, మునిచంద్ర, కిరణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ★

# ఆర్ఎంపీలతో పోరాటం వైద్యుల స్థాయికి తగదు



ఆర్ఎంపీలుగా చెలామణి అవుతున్న గ్రామీణ వైద్యులతో పోరాటం చేయటం వైద్యుల స్థాయి కాదని, సంక్షోభంలో ఉన్న వైద్యరంగంపై దృష్టి పెట్టాలని జేపీ విజ్ఞప్తి చేశారు.

కర్నూలు సర్వజన ప్రభుత్వ వైద్యశాలను సురాజ్య యాత్రలో భాగంగా జేపీ సందర్శించారు. కార్డియాలజీ, కార్డియోథొరాసిక్, న్యూరాలజీ విభాగాలను సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. అనంతరం క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లతో సమావేశమయ్యారు.

ఆర్ఎంపీలు వైద్యులుగా చెలామణి అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని జూడాలు జేపీ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎంపీల వ్యవస్థ నిర్మూలనకు తాము చేసే ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. దీనిపై జేపీ స్పందిస్తూ, రాష్ట్రంలో, దేశంలో వైద్యరంగం ఎదుర్కొంటున్న సంక్షోభంతో పోలిస్తే ఇది చాలా చిన్న అంశమని, ఆర్ఎంపీలను పోటీ అనుకోవద్దని సూచించారు. ఆర్ఎంపీలకు శిక్షణనిచ్చి ప్రాథమిక వైద్యం అందించేలా చేసేందుకు ప్రభుత్వం అనాలోచితంగా జీవో జారీ చేసిందన్నారు. ప్రజారోగ్యం పట్ల నిబద్ధత ఉన్న పాలకులు ఇలా యథేచ్ఛగా వ్యవహరించలేరన్నారు.

ఇలాంటి సమస్యల చుట్టూ డాక్టర్లు సమయాన్ని వృథా చేసుకుంటుండటానికి, రోగులు తరచూ వైద్యుల మీద దాడులకు దిగుతుండటానికి ప్రభుత్వం అధ్వాన్నమైన ఆరోగ్య విధానాన్ని అమలు చేయటమే కారణమని జేపీ అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత దారుణమైనరీతిలో మనదేశంలో వైద్యరంగానికి జీడీపీలో 1.1శాతం ఖర్చు చేస్తున్నారని, ఇందులోనే టీకాలు, వైద్యవిద్య వంటివన్నీ ఉన్నాయని అన్నారు. కొద్దిగా కేటాయింపుల్ని పెంచటంతోపాటు నిధులు వినియోగించే పద్ధతుల్ని మారిస్తే ప్రజల్లో అత్యధికులకు జేబులో నుంచి ఖర్చు లేకుండా మంచి వైద్యం అందుతుందని, డాక్టర్లకు గౌరవప్రదమైన సంతృప్తికరమైన వృత్తిజీవితం లభిస్తుందని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టం చేస్తే పెదాస్పత్రుల మీద భారం లేకుండా మెరుగైన వైద్యసేవలనందించవచ్చాన్నారు. ప్రజలకు, డాక్టర్లకు మేలు చేసే ఆరోగ్య వ్యవస్థను ప్రాథమిక స్థాయి నుంచి నిర్మించగలిగితే ఆర్ఎంపీలు గురించి ఆందోళన చెందాల్సిన అవసరమే ఉండదన్నారు.

బ్రిటన్‌లో 9శాతం, అమెరికాలో 17శాతం వరకూ వైద్య ఆరోగ్యరంగానికి కేటాయింపులు చేస్తున్నాయని, మనదేశంలో ఆరోగ్య రంగానికి భారీ డిమాండ్ ఉన్నా ప్రభుత్వం స్పందించటం లేదని జేపీ అన్నారు. ప్రతి వాణిజ్య సదస్సులోనూ ఆరోగ్య రంగంలో పెట్టుబడులకు ప్రతిపాదనలు వస్తున్నాయన్నారు. కానీ.. మౌలిక వసతుల వరకు ప్రైవేటు రంగాన్ని పరిమితం చేసి వైద్యసేవల బాధ్యతను ప్రభుత్వం తీసుకోకుంటే ప్రజలు

**ప్రైవేటు వచ్చింది కాబట్టి ప్రభుత్వం విఫలం కాలా..**
**ప్రభుత్వం విఫలమైంది కాబట్టే ప్రైవేటు రంగం వచ్చింది**

వైద్యరంగంలో ప్రభుత్వం విఫలం కావటం వల్ల ప్రైవేటు రంగం వచ్చిందికానీ, ప్రైవేటు రంగం వచ్చింది కాబట్టి ప్రభుత్వం విఫలం కాలేదని జేపీ స్పష్టం చేశారు. తాను ప్రైవేటు రంగానికి వ్యతిరేకం కాదని, అయితే ప్రజల మీద ఆర్థికభారం లేకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు. వైద్యవ్యాపారం కోసం మనదేశానికి వస్తున్న విదేశీ కంపెనీల మాతృదేశాల్లో కూడా ప్రజారోగ్యానికి ప్రభుత్వాలే ఎక్కువ ఖర్చు చేస్తున్నాయన్నారు. మనవద్ద నిపుణులైన వైద్యులు, తక్కువ ఖర్చుతో మందులు ఉత్పత్తి చేసే కంపెనీలు, ప్రజల్లో ఆరోగ్యానికి డిమాండ్ ఉన్నా.. అధ్వాన్న పాలన వల్ల ప్రజలకు సరైన ఆరోగ్యం అందటం లేదన్నారు.

తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే ఏడాదికి 6కోట్లమంది వైద్యఖర్చులకు చేసిన అప్పుల వల్ల పేదరికంలో కూరుకుపోతున్నారన్నారు.

32 కోట్ల జనాభా ఉన్న అమెరికాలో 1.2 కోట్లమంది ఆరోగ్య సేవల రంగంలో పనిచేస్తున్నారని, 6.4 కోట్ల జనాభా గల బ్రిటన్‌లో 16లక్షల మంది ఆ రంగంలో ఉపాధి పొందుతున్నారని, కానీ 130 కోట్ల ప్రజానీకం ఉన్న మనదేశంలో కేవలం 36 లక్షలమంది మాత్రమే ఆరోగ్యరంగంలో పనిచేస్తున్నారని జేపీ అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి సరైన ప్రజారోగ్య విధానాన్ని అమలు చేస్తే భారత్‌లో రెండు మూడు కోట్ల కొత్త ఉద్యోగాలను సృష్టించవచ్చన్నారు. ఇంత నష్టం జరుగుతున్నా, ఇన్ని ఉపాధి అవకాశాలున్నా ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై సరైన విధానానికి ముందుకు రావటం లేదని, దీనిపై వైద్యులు, వైద్య విద్యార్థులు ఆలోచన చేయాలని అన్నారు.

అందరికీ ఆరోగ్యం అందించే విధానాన్ని మనదేశంలో అమలు చేస్తే వైద్యవృత్తికి, దేశాభివృద్ధికి, కోట్లాది సామాన్య ప్రజలకు కూడా మేలుజరుగుతుంది కాబట్టి ఇతర ప్రజలతో కలిసి వైద్యరంగం కోసం ఈ విధానం కోసం కృషి చేయాలని జేపీ కోరారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. చంద్రశేఖర్, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, బండారు రామ్మోహనరావు, భీశెట్టి బాబ్జీ, వసంత్, పద్మన్న, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ★

# ఆచరణ సాధ్యమయ్యే హామీలే సురాజ్య యాత్ర



ఆచరణ సాధ్యమయ్యే హామీలనే తీసుకుని లోక్‌సత్తా పనిచేస్తుందని జేపీ అన్నారు. కర్నూలు గ్రామీణంలోని మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సురాజ్య యాత్ర రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గన్నారు. చర్చలో పాల్గన్న మేధావులు, రైతులు, యువత, రాజకీయ, పౌర నాయకులు.. నీటిపారుదల, ప్రణాళికలు, అభివృద్ధిపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశాభివృద్ధికి, యువతకు ఉపాధి లభించటానికి సురాజ్య యాత్ర ఎజెండాలో పేర్కొన్న ఆరు అంశాలు– విద్య, ఆరోగ్యం, లంచాల్లేని ప్రభుత్వ సేవలు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, వ్యవసాయంలో ఆదాయం, చట్టబద్ధపాలన ప్రాథమిక అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇందుకోసం తమ మద్దతునిస్తామని హామీ ఇచ్చారు. స్థానికంగా పలుకుబడిగల పౌరసమాజ నేతలు తమ పలుకుబడిని, వనరులను ఉపయోగించి సురాజ్య లక్ష్యాలను సాకారం చేసేందుకు కృషి చేయాలని, యువతకు మార్గదర్శకత్వం వహించాలని జేపీ కోరారు. మీడియా సురాజ్య కోణంలో వార్తలను, విశ్లేషణల్ని ప్రచురించాలని విజ్ఞప్తి చేశారు. యూత్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్, సిటిజన్స్ ఫర్ బెటర్ ఇండియా డాట్‌కామ్‌లలో నమోదు కావటం ద్వారా సురాజ్య కృషిని విస్తృతం చేసుకోవచ్చని, రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చని జేపీ అన్నారు.

రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ కన్వీనర్ కె. శివనాగిరెడ్డి, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు నక్కలమెట్ట శ్రీనివాసులు, జేవీవీ శ్రీరాములు, హంద్రీ పరివాహక పరిరక్షణ సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలంగాణ, ఏపీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వైబీఐ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ★

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

◆ స్వరాజ్య (స్వాతంత్ర్యం)ను సురాజ్య (సుపరిపాలన)గా మార్చుకోవలసిన సమయమాసన్నమయింది.

- ఎం. వెంకయ్య నాయుడు, ఉప రాష్ట్రపతి

◆ ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు అధిక ధర నిజంగా లభిస్తున్నా రైతులకు దురవస్థలు నిజంగా తొలగిపోవడం లేదు. ఎందుకని? ఉత్పత్తి వ్యయాన్ని సక్రమంగా గణించకపోవడమేనని చెప్పి తీరాలి. ఈ మౌలిక సమస్యను కేంద్ర బడ్జెట్‌లో ఆర్థికమంత్రి పరిష్కరించలేదు.

- భరత్ ఝున్‌ఝున్‌వాలా, ఆర్థికవేత్త

◆ కిలో బియ్యం పండించడానికి రైతు రూ.33 ఖర్చు పెట్టాల్సి వస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ జాతీయ వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్ (సీఏసీపీ)కి నివేదించింది. అదే కిలో బియ్యాన్ని పేదలకోసం కేంద్రం మూడు రూపాయాలకు విక్రయిస్తోంది. తెలుగు రాష్ట్రాలు మరింత భారం మోసి రూపాయికే కిలో బియ్యాన్ని పేదలకు అందజేస్తున్నాయి. పేదలకు ఇలా ఆహారభద్రత కల్పించవచ్చు. అందుకోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.1.40 లక్షల కోట్లను మరో 20శాతం పెంచి కేంద్రం కొత్త బడ్జెట్‌లో రూ.1.69 లక్షల కోట్లు ప్రత్యేకించింది. ప్రజలకు ఆహారభద్రత కల్పించడానికి నిధులు పెంచుతున్న ప్రభుత్వం.. అదే ఆహార పంటలను పండించే రైతులకిచ్చే రాయితీల్ని అదే నిష్పత్తిలో ఎందుకు పెంచడం లేదో అంతుచిక్కడం లేదు.

– మంగమూరి శ్రీనివాస్

◆ ప్రభుత్వం బొట్టు, గాజులు, పారాణి వంటి సౌభాగ్య చిహ్నాలను అడగకుండానే ట్యాక్స్ ఫ్రీ చేసింది కానీ, స్త్రీలు నోరు తెరిచి అడిగినా ప్యాడ్‌లను ట్యాక్స్ ఫ్రీ చేయకుండా భీష్మించుకున్నది. పాలకుల పురుషస్వామ్య దృక్పథానికి ఇది నిదర్శన. దీపికా వంటి సెలబ్రిటీలు ప్యాడ్ మాన్ ఛాలెంజ్ తీసుకోవాల్సింది.. ప్యాడ్‌లను ప్రదర్శించడానికి కాదు, వీటన్నిటి గురించీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి తీసుకోవాలి.

- సామాన్య, రచయిత్రి

◆ దేశంలో ఆర్థిక వ్యవస్థ వైఫల్యం కొనసాగుతోంది. దాని అస్వస్థతకు నివారణే కనిపించటం లేదు. నిజానికి బీజేపీ నుంచి, పార్లమెంటు నుంచి మాత్రమే కాకుండా బయట నుంచి కూడా ప్రతిభావంతులను కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవలసిన అవసరం ఉంది. దేశంలో ఇలాంటి ప్రతిభ ఎంతో ఉంది. ప్రజల్లో తనకు ఇమేజ్ ఉన్నప్పటికీ, తన ప్రభుత్వం సరిగా పనిచేయలేదని ప్రధాని మోదీకి పూర్తిగా తెలుసు. తన ప్రభుత్వం వచ్చే కొన్ని నెలల్లో ఏం చేస్తుందన్నది కాలమే చెబుతుంది. ఉపాధికి సంబంధించి గత మూడున్నరేళ్లుగా జరగని అద్భుతం మిగిలిన కొద్దికాలంలో జరిగిపోతుందంటే సందేహపడాల్సిందే.

- పెంటపాటి పుల్లారావు, రాజకీయ విశ్లేషకులు

◆ ఈ దేశానికి కావాల్సింది భయపెట్టే ప్రధానమంత్రి కాదు. రాజనీతిజ్ఞుడు కావాలి. ప్రజల్లో భావోద్వేగాలు నింపి రాజకీయంగా ఎదగాలనుకునేవారు ఎప్పటికీ రాజనీతిజ్ఞులు కాలేరు.

–వేమూరి రాధాకృష్ణ (ఆర్కే),
సీనియర్ పాత్రికేయులు, ప్రముఖ మీడియా సంస్థల నిర్వాహకులు

*(కర్టెసీ: ఈనాడు, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, ది హిందూ, సోషల్ మీడియా)* ★

# స్థానిక ప్రభుత్వాలకు 50 శాతం నిధులివ్వాలి, తలసరి కేటాయింపు చేయాలి



**రౌండ్‌టేబుల్ తీర్మానాలు**

1) పంచాయతీ సర్పంచులతోపాటు ఎంపీపీ, జడ్పీ ఛైర్‌పర్సన్లను కూడా ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి 2) నిధులు, విధులు, సిబ్బందిని స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలి 3) జాతీయస్థాయి ప్రభుత్వం నుండి 51శాతం నిధుల్ని పొందుతున్న తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో 50శాతం నిధుల్ని స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాలి, తలసరి కేటాయింపు చేయాలి, అక్రమాల నిరోధానికి అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలి 4) రెండవసారి రిజర్వేషన్ల ఆలోచన మంచిదే 5) రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని పూర్తిస్థాయిలో నియమించి వారిచ్చే పరిష్కారాలు, సిఫార్సులకు ప్రాధాన్యతనివ్వాలి

(ఈ సూచనల్ని రాష్ట్ర పంచాయత్‌రాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందించామని, ఆయన విజ్ఞప్తి మేరకు సమగ్రంగా అన్ని అంశాలనూ ఎఫ్‌డీఆర్/ లోక్‌సత్తా తరపున రూపొందించి ఇస్తామని, ఇది పూర్తిగా రాజకీయాలకు అతీతమైన అంశమని పాండురంగారావు ఆ తర్వాత తెలిపారు).

స్థానిక ప్రభుత్వాల సాధికారతకు గత ఇరవై ఏళ్లుగా లోక్‌సత్తా చేస్తున్న బహుముఖ కృషిని పక్షపాత రాజకీయాలకతీతంగా అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలూ అభినందించాల్సిందేనని కాంగ్రెస్ సీనియర్ నేత, కిసాన్‌సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసి లోక్‌సత్తా చైతన్య పరుస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో స్థానిక ప్రభుత్వాల విలువేంటో, వాటిలో ఎలాంటి లసుగులు ఉన్నాయో, సవరణకు ఎలాంటి సంస్కరణలు కావాలో సాధికారికంగా చెప్పేది ఒక్క లోక్‌సత్తా మాత్రమేనన్నారు. లోక్‌సత్తా ఆలోచనల్ని, సేవల్ని వినియోగించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద, మనందరి మీదా ఉందని సూచించారు.

తెలంగాణలో పంచాయత్‌రాజ్ చట్టసవరణకు ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్రశాఖ ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కోదండరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. లోక్‌సత్తా 2.0 ఉద్యమ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రస్తుతమున్న పంచాయతీ వ్యవస్థ ఐదంచెలు కాదని, మూడంచెలుగానే ఉందని రామ్మోహనరావు అన్నారు. నిధులు, విధులు, సిబ్బందిని ఇచ్చి అన్నిస్థాయిల స్థానిక ప్రభుత్వాలకూ అధికారాలను బదిలీ చేయాలని అన్నారు. కో-ఆప్షన్ సభ్యుల పేరుతోనో, మరోరూపంలోనో ఎమ్మెల్యేలు, మంత్రులు తదితరులు స్థానిక ప్రభుత్వాలపై పెత్తనం చేసే ధోరణులకు తక్షణం స్వస్తి పలకాలని పాండురంగారావు అన్నారు. ప్రత్యక్ష ఎన్నికను నిర్వహించి పాతపద్ధతిలోనే సర్పంచులను ఎన్నుకోవాలని సర్పంచుల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ అందోలు కృష్ణ డిమాండ్ చేశారు. ప్రస్తుత సర్పంచుల పదవీకాలం పూర్తయ్యేదాకా వారినే కొనసాగించాలన్నారు. కేంద్రప్రభుత్వం 14వ ఆర్థికసంఘం సిఫార్సు మేరకు పంచాయతీలకు ఇస్తున్న నిధులలో నుంచి రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పేర్లతో డబ్బు లాగేసుకుంటోందన్నారు.

తెలుగుదేశం నాయకుడు, సిరిసిల్ల మునిసిపల్ మాజీ ఛైర్మన్ బుచ్చిలింగం గౌడ్ మాట్లాడుతూ, ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా సర్పంచులకు, మండల అధ్యక్షులకు, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్లకు ప్రత్యక్ష ఎన్నికలు పెట్టారన్నారు. ఆ ప్రజాస్వామిక ఒరవడికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించటం విచారకరమన్నారు. సీపీఎంఎల్ నాయకుడు బాబు, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత ఎన్.శ్రీనివాస్, తెలంగాణ లోక్‌సత్తా నాయకుడు మన్నారం నాగరాజు, సరోజాదేవి, దుర్గారావు, గంగాధరరావు, లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము, కమాల్ అక్తర్, గంగాభవానీ, కిషోర్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ★



# ‘ప్రజావేదిక’ కు లోక్‌సత్తా సహకారం : జేపీ

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్ రాజకీయాలకతీతంగా నిర్వహిస్తున్న ‘జనం కోసం జేపీ’ సురాజ్య ఉద్యమ స్ఫూర్తితో అనంతపురం జిల్లా ఎం.ఎల్.సి గుణపాటి దీపక్‌రెడ్డి ‘ప్రజావేదిక’ను ప్రారంభించారు. గ్రామస్థాయి నుంచి మండలం, నియోజకవర్గం, రాష్ట్రం, ఢిల్లీ దాకా ప్రజలను చైతన్యవంతుల్ని చేసి, ప్రజలే ప్రభుత్వాల్ని నడిపే విధంగా, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను ప్రజలకు సేవకులుగా మారే విధంగా మార్పు తీసుకురావడమే ఈ వేదిక ముఖ్య ఉద్దేశం.

ప్రజావేదిక కరపత్రాన్ని ఇటీవల హైదరాబాద్‌లో జేపీ ఆవిష్కరించారు. ప్రజావేదిక లక్ష్యాలు బాగున్నాయని, లోక్‌సత్తా మద్దతునిస్తుందని, ముందు వేదిక కార్యక్రమాల్లో తాను కూడా పాల్గొంటానని అన్నారు. కార్యక్రమంలో దీపక్‌రెడ్డి, లోక్‌సత్తా పార్టీ అనంతపురం నేత బాబు, సీనియర్ నేతలు ఏ. భాస్కరరావు, డి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

Posting Date 22-02-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on February 16th, 2018

# Feeling Encouraged !

Foundation of Democratic Reforms has been featured in the 2017 Global Go To Think Tank Index Report in the category of

**Top Domestic Health Policy Think Tanks**

The report is published by the think tanks and civil societies program of University of Pennsylvania.



Congratulations to all who have contributed in the development of the organisation and enrichment of the discourse on reforms.

Book-Post
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

To

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad